RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ ఆయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 241 పేజీలు - 08 గురువారం 24 జులై 2025

## బిసి బిల్లుకు బిజెపి మోకాలడ్డు

**- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్**



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై23:** బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు బీసీలకు వ్యతిరేకమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చేందుకు చేస్తోన్న ప్రయత్నాలకు బిఆర్ఎస్ మోకాలడ్డుతోందని విమర్శిం చారు. బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. తాము పంపిన బీసీ రిజర్వేషన్ల బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు భాజపా ససేమిరా అంటోం దని.. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ఆ పార్టీకి ఇష్టం లేనట్లుగా ఉందన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చడం ఎందుకు సాధ్యం కాదన్నా రు. అలాంటప్పుడు అసెంబ్లీలో భాజపా ఎమ్మెల్యేలు ఎందుకు అంగీకరించారని ప్రశ్నించారు. బిల్లు ప్రతిపాదన దిల్లీకి చేరేసరికి ఎందుకు మాట మారుస్తు న్నారో చెప్పాలన్నారు. భాజపా జాతీయ నాయకత్వం.. తమ అభిప్రాయాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి నోటితో పలికిస్తూ పలాయనం చిత్తగిస్తోంది. బీసీ బిల్లు కోసం పార్లమెంట్‌ను స్తంభింపజేస్తాం. ఈ నెల 25న జరగనున్న ఓబీసీల సదస్సులో రాహుల్ గాంధీ బీసీ గొంతుకై నిలవబోతున్నారు. బీసీ వ్యతిరేక పార్టీలైన భాజపా, భారత రాష్ట్ర సమితి నుంచి బీసీల ంతా బయ టకు రావాలని మహేశ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

## భారత్- పాక్ కాల్పులపై ట్రంప్ వ్యాఖ్యలు

**వివరణ ఇవ్వడంలో ప్రధాని మోడీ విఫలం**

**మండిపడ్డ విపక్షనేత రాహుల్ గాంధీ**



**తొలి అక్షరం/న్యూఢిల్లీ, జూలై 23:** భారత్ -పాక్ మధ్య కాల్పుల విరమణకు ఒప్పించానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 25 సార్లు చెప్పారని, దీనిపై కేంద్రం వివరణ ఇవ్వాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. పార్లమెంట్ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన వ్యాఖ్యానించారు. కేంద్రం ఏమని చెబుతుంది. ట్రంప్ మిగతా2లో...

## పార్లమెంట్‌లో ఆగని విపక్షాల రగడ

**- మూడోరోజూ ఉభయసభలు వాయిదా**



**తొలి అక్షరం/న్యూఢిల్లీ, జూలై 23:** ప్రభుత్వ మొండి వైఖరితో పార్లమెంట్ వర్షాకాల సమావే శాలు వరుసగా మూడవ రోజు ఎలాంటి చర్చ లేకుండా తుడిచిపెట్టుకుపోయాయి. బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ మిగతా2లో...

## బిసి రిజర్వేషన్ బిల్లు ఆమోదించకుండా

# తాత్సారం

- మత ప్రాతిపదికన రిజర్వేషన్లు లేనేలేవు
- వెనకబాటుతనం ప్రాతిపదికన గుర్తింపు
- పార్లమెంటులో ఒత్తిడి తెచ్చేలా కాంగ్రెస్ పెద్దలకు నివేదిస్తా..
- ఢిల్లీలో మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి





**తొలి అక్షరం/న్యూఢిల్లీ, జూలై 23:**తెలంగాణ ప్రభుత్వం పంపిన బిసి రిజర్వేషన్ల బిల్ ఆమోదించకుండా కేంద్రం ఆలస్యం చేస్తున్నదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్య ఉపాధి అంశాలతో పాటు, స్థానిక సంస్థల రిజర్వేషన్ల రెండు బిల్లులను ఆమోదించడం లేదన్నారు. బుధవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రం బిల్లును ఆమోదించక పోతే, ఒత్తిడి తెచ్చేందుకు మా వ్యూహం మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మత ప్రాతిపది కన రిజర్వేషన్లు లేవని.. మతాలు ప్రాతిపదిక కాదన్నా రు. వెనుకబాటు తనమే తమ మిగతా2లో...



## తెలంగాణ స్థానికతపై సుప్రీంలో విచారణ

**- పరిష్కారం వెదకాలని ప్రభుత్వానికి ఆదేశం**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ, జూలై 23:** తెలంగాణ స్థానికత వివాదానికి పరిష్కారం వెతకాలని.. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దని తెలంగాణ ప్రభుత్వానికి మిగతా2లో...

## మహాలక్ష్మితో ఆర్టీసికి లాభాల పంట

- ఉచిత ప్రయాణంతో ఆర్టీసికి రూ.6680 కోట్ల ఆదాయం - 200 కోట్ల ఉచిత ప్రయాణాలపై డిప్యూటీ సిఎం వెల్లడి
- మహిళలకు శుభాకాంక్షలు చెప్పిన భట్టి




2లో

## పార్టీ అన్నాక విభేదాలు సర్వసాధారణం

- అన్ని పార్టీల్లోనూ విభేదాలు ఉన్నాయి
- ఈటెల, బండి వ్యవహారంపై ధర్మపురి వ్యాఖ్య



2లో

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

**ఇవి మనకు ప్రీ ఫైనల్ ఎలక్షన్లు**

**కెసిఆర్ కీలకం కావాలంటే లోకల్ ఫైట్ గెలవాలి**

**బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బిజెపి నేతలు**

**కండువా కప్పి ఆహ్వానిస్తూ శ్రేణులకు కెటిఆర్ దిశానిర్దేశం**



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై23:** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు బీఆర్ఎస్ పార్టీకి మలుపు అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు తమ పార్టీ సిద్ధమని కేటీఆర్ చెప్పారు. లోకల్ బాడీ ఎన్నికలు బీఆర్ఎస్ పార్టీకి ప్రీ ఫైనల్స్ లాంటివన్నారు. ఎన్నికలకు బీఆర్ఎస్ కార్యకర్తలు సన్నద్ధం కావాలని కూడా ఈ సందర్భంగా కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మళ్ళీ కేసీఆర్ కీలకం కావాలంటే.. స్థానిక సంస్థల ఎన్నికలు ముఖ్యమని కేటీఆర్ చెప్పారు. బుధవారం తెలంగాణ భవన్లో కేటీఆర్ పార్టీ శ్రేణులతో భేటీ అయిన సంద ర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. లోకల్ బాడీ ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దన్న కేటీఆర్.. మిగతా2లో...



## పదేళ్లలో ఆర్టీసిని నిర్వీర్యం చేశారు

**ఓ దశలో ఆర్టీసీ మనుగడపైనా ఆందోళన**

**ఇప్పుడిప్పుడే సంస్థను లాభాల్లోకి తెస్తున్నాం**

**200 కోట్ల ప్రయాణాల పూర్తి వేడుకల్లో మంత్రి పొన్నం**

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై23:** గత 10 సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను నిర్వీర్యం చేశారని, ఓ సమయంలో ఆర్టీసీ ఉంటుందా అన్న ఆందోళనకర పరిస్థితి ఉండేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల్లోకి వస్తుందని తెలిపారు. గత 10 సంవత్సరాల్లో ఆర్టీసీ ఉద్యోగుల పైసలు వాడుకున్న పరిస్థితి ఉండేదని, ఇప్పుడు వారికి డబ్బులు చెల్లి స్తున్నాం అని చెప్పారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో పాటు బస్సులకు యజమానులకు చేయడమే లక్ష్యంగా మిగతా2లో...

## హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

**మొత్తం రూ.69 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం**

**హైదరాబాద్ సిపి సివి ఆనంద్ వెల్లడి**



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై23:** హైదరాబాద్‌లో మరోసారి పోలీసులు భారీగా డ్రగ్స్ పట్టుకున్నారు. డ్రగ్ విక్రయిస్తున్న తొమ్మిది మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కొకైన్ సరఫరా చేస్తున్న ఆరుగురు, మెఫిడ్రీన్ సరఫరా చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. హైదరాబాద్ సిపి సివి ఆనంద్ మీడియాతో మాట్లాడారు... ప్రేమ్ ఉపాధ్యాయ్ అనే వినియో గదారుడిని పట్టుకోవడంతోనే డ్రగ్ ముఠాగుట్టు రట్టు అయిందని, నిందితుల నుంచి మొత్తం రూ. 69 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకు న్నామని తెలిపారు. డ్రగ్స్ కేసులో రవి వర్మ, సచిన్ అనే ఇద్దరు కీలక వ్యక్తులను పట్టుకు న్నామని, ఈ ఇద్దరి నుంచి కీలకమైన సమా చారం సేకరించామన్నారు. రవివర్మకు ముంబ యికి చెందిన ముఠాతో సంబంధాలు ఉన్నా యని, ముంబయిలో వాహిద్ అనే వ్యక్తికి విదేశా ల నుంచి కొకైన్ వస్తుందని, ముంబయిలోని వాహిత్ నుంచి నిందితులు హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకవస్తున్నారని ఆనంద్ పేర్కొన్నారు. నిందితుల నుంచి 286 గ్రాముల కొకైన్, 11 గ్రాముల ఎక్స్టసీ, తుపాకీ, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబా ద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ కేసు వివరాలను సీపీ సీవీ ఆనంద్ మిగతా2లో...

# భారత్‌- పాక్ కాల్పులపై ట్రంప్ వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

కాల్పుల విరమణ చేయించారనా ? కానీ అలా చెప్పలేరు. అయినా అదే నిజం. ఇది కేవలం కాల్పుల విరమణ వరకే కాదు. మనం చర్చించాల్సిన చాలా పెద్ద సమస్యలు ఉన్నాయి. కాల్పుల విరమణ చేయించినట్టు 25 సార్లు ట్రంప్ చెప్పారు. అసలు ట్రంప్ ఎవరు ? అది ఆయన పనికాదు. ప్రధాని సమాధానం ఇవ్వడం లేదు. అది వాస్తవం అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. భారత్‌పాక్ మధ్య కాల్పుల విరమణకు ఒప్పించామని మంగళవారం కూడా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. ఈ ఘర్షణలో ఐదు విమానాలు కూలిపోయినట్టు చెప్పారు. కాకపోతే.. ఏ దేశానివో మాత్రం వెల్లడించలేదు. ఈ ఘర్షణ అణుయుద్ధం వరకు వెళ్లేదన్నారు. రెండు వైపులా యుద్ధ విమానాలు కూలిపోయినట్టు- పేర్కొన్నారు. మరోవైపు ఇటీవల జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌డోభాల్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ భారత్ వైపు నష్టం జరిగినట్టు- కనీసం ఓ గాజు పెంకునైనా చూపించాలని సవాల్ చేయడం గమనార్హం.

# పార్లమెంట్‌లో ఆగని విపక్షాల రగడ

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం ఉభయ సభల్లోనూ ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. ప్లకార్డులు ప్రదర్శిస్తూ చర్చ జరపాల్సిందేనని పట్టుబట్టాయి. బుధవారం ఉదయం ప్రారంభమైన వెంటనే ఉభయ సభలు మధ్యాహ్నానికి వాయిదా పడ్డాయి. తిరిగి సమావేశమైన వెంటనే మరో రెండుసార్లు వాయిదా పడ్డాయి. మంగళవారం కూడా పార్లమెంటు ఎలాంటి కార్యకలపాలను నిర్వహించలేదు. రాజ్యసభ ప్రారంభం కాగానే బీహార్ ఎస్ఐఆర్ సహా పలు అంశాలపై చర్చ జరపాలంటూ రూల్ 267 కింద ప్రతిపక్షాలు 25 నోటీసులిచ్చాయి. బెంగాలీ వలసకార్మికులపై వివక్ష మరియు దేశంలో పెరుగుతున్న విమాన ప్రమాద ఘటనలు సహా మరికొన్ని అంశాలను లేవనెత్తారు. అయితే ఈ నోటీ-సులను డిప్యూటీ- చైర్మన్ హరివంశ్ రాయ్ తిరస్కరించారు. వెంటనే ప్రతిపక్షాలు నిరసనలు చేపట్టాయి. శ్రీలంక నావికాదళం భారతీయ జాలర్లను అరెస్ట్ చేసిన అంశాన్ని లేవనెత్తేందుకు డిఎంకె ఎంపి వైకో యత్నించారు. అయినప్పటికీ ప్రభుత్వం మొండిపట్టు-దలతో చర్చకు తిరస్కరించింది. నిరసనల మధ్య ఎగువ సభ గురువారానికి వాయిదా పడింది. లోక్‌సభలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. వివిధ అంశాలపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. వెల్‌లోకి దూసుకువెళ్లారు. మొదట చైర్మన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన కొంతసేపటికే సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు- చైర్మన్ ప్రకటించారు. ఎలాంటి చర్చ, కార్యకలాపాలు లేకుండా ఉభయ సభలు గురువారానికి వాయిదా పడ్డాయి.

# తెలంగాణ స్థానికతపై సుప్రీంలో విచారణ

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణని ఆగస్టు 5వ తేదీకి వాయిదా వేసింది. నీట్ పరీక్ష రాయడానికి ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివితేనే స్థానికత వర్తిస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు విధించింది. ఈ నిబంధనలు చెల్లవంటూ తెలంగాణ హైకోర్టు గతేడాది తీర్పు వెల్లడించింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం సవాలు చేసింది. గతేడాది మాత్రం పిటీషనర్లకు ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. ఈ ఏడాది తమకు కూడా స్థానికత నిబంధనల నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ సుప్రీంకోర్టులో విద్యార్థులు పిటిషన్లు దాఖలు చేశారు. తెలంగాణలో పుట్టి పదో తరగతి వరకు చదివినా స్థానిక కోటా దక్కడం లేదని పిటీ-షన్‌లో పేర్కొన్నారు విద్యార్థులు. 11, 12వ తరగతులు చదవని కారణంగా నీట్‌లో స్థానిక కోటా దక్కక నష్టపోతున్నామని తెలంగాణ విద్యార్థులు సుప్రీంకోర్టుకి వివరించారు. ఈ మేరకు సమస్యకు పరిష్కారం చూపాలని, విద్యార్థులను ఇబ్బందులు పెట్టొద్దంటూ తెలంగాణ ప్రభుత్వానికి ఉన్నత న్యాయస్థానం సూచిస్తూ విచారణ వాయిదా వేసింది.

# పార్టీ అన్నాక విభేదాలు సర్వసాధారణం

- అన్ని పార్టీల్లోనూ విభేదాలు ఉన్నాయి
- ఈటెల, బండి వ్యవహారంపై ధర్మపురి వ్యాఖ్య



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై23:** పార్టీ అన్నాక వ్యక్తులు, వారి మధ్య విభేదాలు సహజమని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. ఇది అన్ని పార్టీల్లోనూ ఉందన్నారు. కుటుంబ పార్టీల్లో కూడా అన్నా చెల్లెళ్లకు, కూడా విభేదాలు ఉన్నాయని అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ , మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ వివాదంపై ధర్మపురి అరవింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ , కాంగ్రెస్ పార్టీల్లో నేతల మధ్య ఉన్న వైరంపై కూడా ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. బుధవారం అరవింద్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో రాజగోపాల్ రెడ్డి ఏం చేస్తున్నాడు.. ఆ పార్టీ హై కమాండ్ ఏం చేస్తోంది. అలాగే కొండా మురళి, కొండా సురేఖలు ఏం చేస్తున్నారు. బీఆర్ఎస్‌లో కవిత, కేటీ-ఆర్ ఏం చేస్తున్నారు. పార్టీ అన్నాక కొన్ని వివాదాలు నడుస్తూ ఉంటాయి. బీజేపీ పాత అధ్యక్షుడు, కొత్త అధ్యక్షుడు కలిసి ఈటెల రాజేందర్, బండి సంజయ్‌ల విషయంలో కూర్చొని మాట్లాడాలని సూచించారు. అవసరమైతే బీజేపీ అధిష్టానం పెద్దలు మాట్లాడాలని చెప్పుకొచ్చారు. ఈటెల, బండి సంజయ్‌ల విషయంలో బీజేపీ కేంద్ర హై కమాండ్ నోడల్ ఎంక్వయివరీ కమిషన్ వేసుకోవాలని సూచించారు. రాజాసింగ్ ఎక్కడున్నా తాము గౌరవిస్తామని.. ఆయన ఐడియాలాజికల్ మ్యాప్ అని అభివర్ణించారు. ఆయన సస్పెండ్ కాలేదని.. రిజైన్ చేశారని గుర్తుచేశారు. రాజాసింగ్ రేపు పార్టీ సభ్యత్వం కోసం మిస్డ్ కాల్ ఇస్తే మెంబర్‌షిప్ తీసుకోవచ్చని సూచించారు. కొన్ని విషయాల్లో మనస్థాపం చెంది రాజాసింగ్ రాజీనామా చేశారని చెప్పుకొచ్చారు. తెలంగాణ బీజేపీ ఎంపీలకు ఒక్కొక్కరికి రెండు నియోజకవర్గాల బాధ్యతలు ఇవ్వాలని ఎంపీ అరవింద్ కోరారు. ఎంపీలు పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలని.. ఫలితం చూపించకపోతే పక్కకు పెట్టాలని అన్నారు. ఏ పార్టీకైనా కార్యకర్తలు కీలకమని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు అయ్యే సమయం ఇదని ఉద్ఘాటించారు. ఇందూరు జిల్లాలో జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని తాము గెలుస్తున్నామని జోస్యం చెప్పారు. తెలంగాణలో వచ్చేవి కార్యకర్తల కోసం జరిగే ఎన్నికలని.. బీజేపీ శ్రేణులు ఈ విషయాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు. తమ కార్యకర్తలను నాయకులుగా చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎంపీ ధర్మపురి అరవింద్ పిలుపునిచ్చారు.

# హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. కాటేదాన్‌లో డ్రగ్స్ దందా చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన పవన్ భాటీ-ని కూడా అరెస్ట్ చేశాం. హేమ్‌సింగ్ అనే మరో వ్యక్తితో కలిసి పవన్ భాటీ- డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. నిందితులు ముందు జాగ్రత్తగా రివాల్వర్, బుల్లెట్లు- కూడా కొనుగోలు చేశారని సీపీ వివరించారు.

# బిసి రిజర్వేషన్ బిల్లు ఆమోదించకుండా తాత్సారం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాతిపదిక అని స్పష్టం చేశారు. గురువారం ఉదయం మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలను కలుస్తామని తెలిపారు.. సర్వే వివరాలు వివరిస్తామని స్పష్టం చేశారు. తమ తరఫున పార్లమెంట్ లో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరతమన్నారు. అలాగే సర్వే కోసం జరిగిన పక్రియ పై కాంగ్రెస్ ఎంపీలకు వివరిస్తామని వెల్లడించారు. జనగణనలో కులగణన చేర్చాలని.. జనగణనలో కులగణన ఎలా చేయొచ్చు.. దేశానికి తెలంగాణ మోడల్ గా నిలిచిందో వివరిస్తామన్నారు. తాము చేసిన సర్వే దేశానికి రోల్ మోడల్ అని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి తమ కార్యాచరణ సిద్ధం చేశామని వెల్లడించారు. కేంద్రం రిజర్వేషన్లను ఆమోదించాలని.. అందుకే కేంద్రం పై ఒత్తిడి తేవాలన్నారు. అవసరం అయితే కూటమి నేతలను కూడా కలుస్తామని చెప్పారు. సోషల్ జస్టిస్‌కు అందరూ సహకరించా లని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. గుజరాత్, యూపీ, మహారాష్ట్రలో ముస్లింలకు రిజర్వేషన్లు ఉన్నాయి. అక్కడ ముస్లిం రిజర్వేషన్లు తొలగించి బీజేపీ నేతలు తెలంగాణ గురించి మాట్లాడాలి. బీజేపీ నేతలు వితండ వాదం చేస్తున్నారు. ఒక ఇంటర్వ్యూలో ముస్లిం రిజర్వేషన్లు అమలు చేస్తాం అని అమిత్ షా అన్నారు. ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా..? కేంద్రం తక్షణమే బిల్లును ఆమోదించాలి. సర్వేను శాసన సభలో ప్రవేశ పెట్టి పూర్తి స్థాయిలో చర్చకు అవకాశం ఇచ్చాం. వ్యక్తుల వ్యక్తిగత వివరాలను బహిరంగ పరచలేదు. 3.9 శాతం ప్రజలు తమకు ఏ కులం లేదని డిక్లేర్ చేశారు. ఎక్స్పర్ట్ కమిటీ- ఇచ్చిన రిపోర్ట్ ను రోడ్ పై పెట్టలేం. ఫస్ట్ క్యాబినెట్ ముందు పెట్టాలి. శాసన సభలో ప్రశ్నిస్తే.. సమాధానం చెప్తాం. అడిగిన వివరాలు ఇస్తాం. పబ్లిక్ డొమైన్ లో పెట్టేటప్పుడు.. అన్ని న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తాం. క్యాబినెట్‌లో చర్చించి, శాసన సభలో ప్రవేశ పెడతాం. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు లేవు. మతాలు ప్రాతిపదిక కాదు. వెనుకబాటు తనమే మా ప్రాతిపదిక. బీజేపీ తొండి వాదన చేస్తోంది. తమ దగ్గర రీసెర్చ్ అండ్ అనాలసిస్ వివరాలు ఉన్నాయని సిఎం వివరించారు.

# మహాలక్ష్మితో ఆర్టీసికి లాభాల పంట

- ఉచిత ప్రయాణంతో ఆర్టీసికి రూ.6680 కోట్ల ఆదాయం
- 200 కోట్ల ఉచిత ప్రయాణాలపై డిప్యూటీ సిఎం వెల్లడి
- మహిళలకు శుభాకాంక్షలు చెప్పిన భట్టి




**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై23:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 200 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి రూ.6680 కోట్ల రూపాయలు ప్రయాణ చార్జీలు ఆదా చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్‌లో మహాలక్ష్మి సంబరాలు చేపట్టింది. ఉచిత బస్సు ప్రయాణాల వేడుకలకు డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ హాజరయ్యారు. ఆర్టీసీ వేడుకలలో పాల్గొన్న డిప్యూటీ- సీఎం భట్టి రాష్ట్ర మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన తర్వాత ఆర్టీసీ లాభాల్లోకి వచ్చిందని పేర్కొన్నారు. 200 కోట్ల మహిళా ఉచిత ప్రయాణాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ పండగ కార్యక్రమాలు ఏర్పాటు- చేసింది. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2023 డిసెంబర్ 9న ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించాం. 200 కోట్ల ఉచిత మహిళా ప్రయాణికులు 6680 కోట్లు- ఆదా చేసుకున్నారు వారికి శుభాకాంక్షలు. మునిగిపోతున్న పడవ ఎందుకు ఎక్కుతారని ఆరోజు అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన తరువాత ఇప్పుడు ఆర్టీసీ లాభాల్లోకి వచ్చింది. మునిగిపోతున్న పడవ కాదు లాభాల్లోకి వస్తున్న ప్రభుత్వ సంస్థ. 200 కోట్ల మహిళా ప్రయాణికుల చార్జీలను 6680 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించింది. భవిష్యత్తులో కూడా మీ చార్జీలను ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. వచ్చిన ఆదాయం ద్వారా కొత్త బస్సులు కొనుగోలు చేసే స్థాయికి ఆర్టీసీ ఎదిగింది. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు 2400 కొత్త బస్సులు కొనుగోలు చేసిందని డిప్యూటీ- సీఎం భట్టి చెప్పారు. ఆర్టీసీపై రవాణా శాఖ మంత్రి కొత్త విధానాలు ప్రవేశపెట్టారు. ఒకప్పుడు ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేషియో 62 శాతం ఉంటే.. ఇప్పుడు 97 శాతంకి పెరిగింది. మహాలక్ష్మికి ముందు 45 లక్షల మంది ప్రయాణం చేస్తే.. ఇప్పుడు 65 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో కాలుష్యం పెరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆలోచన చేశారు. కాలుష్య రహిత నగరంగా మార్చడానికి నగరంలో ఉన్న 2800 బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు తీసుకురావాలని ఆర్టీసీ కసరత్తు చేస్తోంది. ఇప్పుడు ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. ఇప్పటికే 3000 ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులకు ఆర్డర్ ఇచ్చారు. ఇప్పటికే 11 శాతం ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులు వచ్చాయి, దానిని పెంచు కుంటూ పోతున్నారు. మహాలక్ష్మి పథకం విరివిగా ఉపయోగించి 200 కోట్ల ప్రయాణాలు పూర్తి చేసుకొని మీరు అనేక ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకున్నారు, నగరాల్లో పనికి ఉపయోగించుకున్నారు, అవసరాల నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్ళారు. మీరు 6680 కోట్ల రూపాయలు మీ కుటు-ంబాలకు అదా చేసుకున్నారు. కోటి మంది మహిళలను కోటీ-శ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది. ఆర్టీసీలో కేవలం ప్రయాణమే కాదు.. ఆర్టీసీ బస్సులకు యాజమానులను చేశాం. వడ్డీలేని రుణాలు ద్వారా బస్సులు కొనుగోలు చేయించారు. 150 మహిళా సంఘాల ఆర్టీసీ బస్సు యజమానులకు కోటి రూపాయల చెక్కులు ఇటీ-వలే అందించాం. ఇప్పటికే 25 వేల కోట్ల వడ్డీలేని రుణాలు మహిళలకు అందించాం. ఈ 5 ఏళ్లలో లక్ష కోట్లు- మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తాము. రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల కోట్ల రూపాయలతో రోడ్ల మరమత్తులు ,అభివృద్ధి చేయడానికి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకు పోతున్నారు. దీని ద్వారా రవాణా మరింత అభివృద్ధి చెందుతుందని డిప్యూటీ- సీఎం తెలిపారు.

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

(మొదటి పేజీ తరువాయి)

పోటీచేసే అభ్యర్థులపై స్థానిక బీఆర్ఎస్ నేతలు ఏకాభిప్రాయానికి రావాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బంపర్ మెజార్టీతో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని, కాంగ్రెస్ కార్యకర్తల్లాగా పనిచేస్తున్న అధికారులంతా అప్పుడు సెట్ రైట్ అవుతారని కెటిఆర్ అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు స్థానిక సంస్థల ఎన్నికలు ప్రీ ఫైనల్ లాంటివని, కేటీఆర్ టికెట్ ఎవరికి ఇచ్చినా వారిని గెలిపించుకోవాలని పార్టీ క్యాడర్‌కు సూచించారు. వికారాబాద్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నేతలు భారీ సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ వారిని పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించి చెప్పాలన్నారు. పాలిచ్చే బర్రెను పక్కనపెట్టి ఎగిరితన్నే దున్నపోతును తెచ్చుకున్నట్టు- అయిందని తెలంగాణ ప్రజలు బాధపడుతున్నారని కేటీఆర్ చెప్పారు. ఆరు గ్యారంటీల పేరుతో అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇవాళ తెలంగాణ ప్రజలను దారుణంగా మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ముఖ్యమంత్రితో సహా కాంగ్రెస్ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. కాని అధికారంలో ఉన్న తొమ్మిదేళ్లు 6.5 లక్షల రేషన్ కార్డులను అర్హులకు ఇచ్చాం. ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే 90 వేల కార్డులు ఇచ్చాం. అయితే ఈ పనులు అన్నింటిని ఏవో ఘనకార్యాలుగా మేము ఎన్నడూ భావించలేదు. ప్రజలకు రొటీ-న్‌గా చేసేవే అనుకున్నాం. అయితే మీసేవ సెంటర్‌లో ఇచ్చే రేషన్ కార్డులకు కూడా ప్రస్తుత కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపెద్ద సభలు పెట్టి చెప్పుకుంటున్నాడు అని కేటీ-ఆర్ విమర్శించారు. ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ దారుణంగా మోసం చేసింది. పెన్షన్ తీసుకునే పెద్దమనుషులకు రేవంత్ రెడ్డి 40 వేల రూపాయలు బాకీ ఉన్నాడు. ఆడపిల్లలకు ఐదు లక్షల భరోసా కార్డు, స్కూటీలు, నెలకు 2,500 రూపాయలు ఇస్తా అన్నాడు. కానీ ఏమి చేయలేదు. ప్రస్తుతం తెలంగాణలోని ప్రతీ ఆడబిడ్డకు రేవంత్ రెడ్డి 50 వేల రూపాయలు బాకీ ఉన్నాడు. రాహుల్ గాంధీ ఫోటోతో గ్యారెంటీ- కార్డులు ఇచ్చి తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ నాయకులు అరచేతిలో వైకుంఠం చూపించారు. 11 సార్లు రైతుబంధు వేసి ఏనాడు కేసీఆర్ రాజకీయం చేయలేదు. అన్నదాతలకు న్యాయం చేశామనే అనుకున్నారు. నాట్లు- వేసేటప్పుడు ఇవ్వకుండా ఓట్లు-వేసే -టైముకు రేవంత్ రెడ్డి రైతుబంధు వేస్తున్నాడు. అధికారంలోకి వచ్చిన 20 నెలలో ఒకసారి మాత్రమే రైతుబంధువేసి దానికి సంబరాలు చేసుకోవాలని చెప్తున్నాడు' అని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారు. కళ్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇస్తానని చెప్పి రేవంత్ రెడ్డి పత్తా లేకుండా పోయాడు. ముఖం బాగా లేక అద్దం పగలగొట్టుకున్నట్టు- రేవంత్ రెడ్డి ప్రవర్తిస్తున్నాడు. ఆయనకు పాలన చేతగాక సమర్థత లేక రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడం చేతకాని దద్దమ్మ రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక కేసీఆర్‌ను నిందిస్తున్నాడని మండిపడ్డారు.

# పదేళ్లలో ఆర్టీసిని నిర్వీర్యం చేశారు

(మొదటి పేజీ తరువాయి)

మహిళా సంఘాలకు బస్సులు కొనుగోలు చేసిందన్నారు. ఆర్టీసీకి ఈ ప్రభుత్వం ఎప్పటికప్పుడు అండగా ఉంటుందని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. 200 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంజీబీఎస్ బస్టాండ్‌లో ఆర్టీసీ వేడుకలునిర్వహించింది. డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ వేడుకలకు మంత్రి పొన్నం హాజరై మాట్లాడారు. 200 కోట్ల మహిళా ఉచిత ప్రయాణం పూర్తయిన సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ పక్షాన 2023 డిసెంబర్ 9న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా శాసన సభ వేదిక మహాలక్ష్మి పథకం ప్రారంభించుకున్నాం. సంస్థ పరిరక్షణ ప్రయాణికుల సౌకర్యం ఉద్యోగుల సంక్షేమం నినాదంతో ఆర్టీసీ ముందుకు పోతుంది. ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో పాటు- బస్సులకు యజమానులకు చేయడమే లక్ష్యంగా మహిళా సంఘాలకు బస్సులు కొనుగోలు చేసింది. ఇటీవల 150 బస్సులకి కోటి రూపాయల చెక్కులు కూడా అందజేసాము. గతంలో 45 లక్షల మంది ప్రయాణం చేస్తే ఇప్పుడు 65 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. 60 శాతం ఉన్న ఆక్యుపెన్సీ ఇప్పుడు 97 శాతంకి పెరిగింది. ఆర్థిక విధ్వంసం తరువాత ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. ఆర్టీసీకి ఈ ప్రభుత్వం ఎప్పటికప్పుడు అండగా ఉంటుంది. ఈరోజు 97 బస్సు డిపోలు, 324 బస్ స్టేషన్లలో 200 కోట్ల మహిళా ఉచిత ప్రయాణాలు 6680 కోట్ల రూపాయల విలువైన ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాలు నిర్వహిస్తున్నాం అని మంత్రి పొన్నం చెప్పుకొచ్చారు.

# యాదాద్రీశుడికి రూ.2,45,48,023 నగదు



**తొలి అక్షరం/యాదగిరిగుట్ట,జూలై23:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయానికి భక్తుల రాకతో పాటే ఆదాయం కూడా సమకూరుతోంది. ఇటీవల భారీగా వస్తున్న భక్తులతో హుండీ ఆదయం పెరిగింది. ఆలయంలోని హుండీల్లో గత 41 రోజులుగా భక్తులు సమర్పించిన నగదు, నగల కానుకలను బుధవారం ఆలయ సిబ్బంది లెక్కించారు. ఈ లెక్కింపు ద్వారా రూ.2,45,48,023 నగదు సమకూరినట్లు ఆలయ ఈవో వెంకట్రావు తెలిపారు. దీంతో పాటు- బంగారం 38 గ్రాములు, వెండి 2,800 గ్రాములు, వివిధ దేశాల కరెన్సీ లభించాయన్నారు. వీటిని ఎప్పికప్పుడు బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తున్నారు.

# దాట్ల గ్రామ మాజీ సర్పంచ్ కొమ్మినేని రవీందర్ జనసేన పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి వెల్తూరి నగేష్ శివాలయ పునర్నిర్మాణ దాత పత్తి సమ్మయ్య ఆహ్వానం







**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (పస్తం సాంబ) జూలై 23:** తొర్రూర్ పట్టణంలో ఈనెల 31వ తేదీన పాటి మీద ఆలయంలో జరిగే శివాలయ దేవాలయం పునర్నిర్మాణం ఉత్సవాలకు హాజరు కావాలని దాట్ల గ్రామం మాజీ సర్పంచ్ కొమ్మినేని రవీందర్ జనసేన పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి వెల్తూరి నగేష్ మరియు ముఖ్య నాయకులు పస్తం లక్ష్మణ్ పల్లెర్ల రమేష్ వడ్లూరి రజినీకాంత్ చింతల మధు గట్ల సతీష్ జక్కుల శంకర్ లను ఆలయ పునర్నిర్మాణ దాత పత్తి సమ్మయ్య మరియు కమిటీ సభ్యులు పత్తి లక్ష్మణ్, పత్తి పవన్, కొండపల్లి సాంబ , సిరిగిరి రాంబాబు, పేర్ల సంతోష్ బుధవారం దాట్ల గ్రామంలో నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో అలాగే కలిసి ఆహ్వాన పత్రికను అందజేసినట్లు తెలిపారు ఈ సందర్భంగా దాట్ల గ్రామ మాజీ సర్పంచ్ కొమ్మినేని రవీందర్ జనసేన పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి వెల్తూరి నగేష్ పత్తి సమ్మయ్య తో మాట్లాడుతూ.ఈ మహోన్నతమైన దేవాలయ పున నిర్మాణ కార్యక్రమానికి ఆహ్వానం అందించినందుకు పత్తి సమ్మయ్యకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

---

# సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**• జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రవి రాథోడ్.**



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జూలై 23:** ఏజెన్సీ ప్రాంతం లోని కొత్తగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ సందర్శించి హాజర్ పట్టికను,రికార్డులను పరిశీలించి వైద్యాధికారులకు, సిబ్బంధికి తగిన సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు అధికంగా నమోధవుతున్నందున ఈ నెలలో కాన్పు కు వున్నవారిని దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని ఒకవేళ హై రిస్క్ గా వున్న గర్భిణీ స్త్రీలను అన్నీ వసతులు వున్న ప్రభుత్వ వైద్యశాలలకు ముందుగానే తరలించాలని ఆయన తెలిపారు.ప్రస్తుత వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, విరేచనాలు వంటి సీజనల్ వ్యాధులు విస్తరిస్తున్న నేపథ్యంలో ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, మురికి కాల్వలలో, ఇంటి పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ వుండకుండా చూసుకోవడం పైన ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్ లను, మలేరియా, డెంగ్యూ సంభంధిత ఆర్‌డిటి కిట్ల నిల్వలను సరి చూసుకోవాలని, లేనట్లైతే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిల్వలను సమకూర్చుకోవాలని అన్నారు.కొత్తగూడ మండలం లోని విద్యార్థులు వుండే వసతి గృహాలు, విద్యాలయాలలో వైద్య శిభిరాలను నిర్వహించి చికిత్స అంధించాలని, అట్టి వివరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖా కార్యలయంలో అంధించాలని తెలిపారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, చికిత్స, ఔషధాల పంపిణీ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ శివ, డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సంపత్, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి రాజు, సూపర్వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

---

# సిపిఐ మండల కార్యవర్గ సమావేశం



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 23:** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో సిపిఐ మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని దేశ స్వావలంభన సమృద్ధి కొరకు రాజ్య భరణాలను రద్దు, బ్యాంకుల జాతీయ కరణం, ప్రభుత్వ రంగాన్ని విస్తరించటం, భూ సమస్యల పరిష్కారం కొరకు అలుపెరుగని ఉద్యమాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది. నేడు కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా రాజ్యాంగం కల్పించిన రాష్ట్ర కేంద్రాల సంబంధాలకు నేలపుగా ఉన్న సమైక్య వ్యవస్థను విచ్చిన్ననికి మోడీ ప్రభుత్వం పూనుకుంది. రాష్ట్ర జాబితాలో అధికారులైన విద్య విధానం, విద్యుత్, వ్యవసాయం లాంటి అన్ని అంశాలను కేంద్రం లాగేసుకోవడంతో పాటు జీఎస్టీ లాంటి కేంద్రీకృత పన్నుల విధానం ద్వారా రాష్ట్రాలను ఆర్థికంగా కూడా బలహీన పరుస్తుంది. ఎన్నికల కమిషన్ సిబిఐ ఈడీ జ్యూడియేషన్ ఐటి జాతీయ దర్యాప్తులను సంస్థలకు ఏదేచ్చగా విచ్చలవిడిగా అనేక రకాలుగా ఉపయోగిస్తూ ఎన్నడూ లేని విధంగా సమైక్య వ్యవస్థను ధ్వంసం చేస్తుంది. ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా ప్రవేట్ పరం చేస్తూ ప్రభుత్వం ఆస్తులను ఆదాని అంబానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు దానతత్వం చేస్తున్నారు. రాజ్యాంగంలో పొందపరిచిన సౌరభౌత్వ విద్వాసానికి మోడీ ప్రభుత్వం పాల్పడుతుందని అన్నారు. అదేవిధంగా సిపిఐ జిల్లా 4 వ మహాసభ వలిగొండ మండలంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్లో జిల్లా 4వ మహాసభను విజయవంతం చేయాలని కరపత్రం విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మాణిక్యం, మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, మండల కార్యవర్గ సభ్యులు బోల శీను, పల్లె వెంకన్న, మంచాల రాధమ్మ, పసుల నరసింహ, బీరకాయల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

---

# విద్యాసంస్థల బంద్ విజయవంతం: పిడిఎస్యూ, ఎఐవైఎఫ్, పివైఎల్

**• విద్యాశాఖ మంత్రిని నియమించాలి • స్కాలర్షిప్స్ ,ఫీజు రీయింబర్స్మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలు విడుదల చేయాలి • విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి.ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలి • ఎన్ఈపి -2020 రద్దు చెయ్యాలి • ప్రవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కనీస వేతనం ఉద్యోగ భద్రత కల్పించాలి**





**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 23:** వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా యాదగిరిగుట్ట పట్టణంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కళాశాలలు బంద్ నిర్వహించడం జరిగిందని వామపక్ష విద్యార్థి, యువజన నాయకులన్నారు.ఈ సందర్భంగా ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్, ఏ ఐ వై ఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించలేదని, గత కొన్ని సంవత్సరాలుగా 8,600 కోట్ల రూపాయల పెండింగ్ స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రారంబించాడానికై అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులు అలాగే ,డిఈఓ, ఎంఈఓల పోస్టులను భర్తీ చేయాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న పాఠశాలకు కళాశాలలు, హాస్టల్స్ సొంత భవనాలు నిర్మించాలని, సంక్షేమ హాస్టల్స్ జనరల్ హాస్టల్స్ పెండింగ్ లో ఉన్న మెస్ ,కాస్మోటిక్స్ బకాయిలను విడుదల చేయాలని, ప్రవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు భద్రత కల్పించాలని, తదితర డిమాండ్ల విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా యాదగిరిగుట్ట పట్టణంలో ఉన్నటువంటి ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు బందు నిర్వహించడం జరిగిందని వారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యారంగా సమస్యలను తక్షణమే పరిష్కరించనీ యెడల విద్యార్థులందరినీ ఐక్యం చేసి ఉద్యమాలు ఉదృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ బంద్ విజయవంతానికి సహకరించిన విద్యార్థులకు ప్రభుత్వ ,ప్రైవేటు పాఠశాల కళాశాల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలియజేశారు.మండల నాయకులు అనంతుల నరసింహ ,రావుల శ్రీను, తోటకూరి శేఖర్ ,బి వెంకటేష్, అరుణ్ ,రాము, అనిల్ మధు, రాణి, విద్య, అరుణ, కల్పన, శ్రీవాణి పాల్గొన్నారు.




---

# కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ





**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జులై 23:** జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, మహబూబాబాద్ జిల్లాలోని గూడూరులోనీ కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు,ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల యొక్క అభ్యసన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు, ప్రతీ సబ్జెక్టుపై పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు బోధనలు కొనసాగించాలని ఆయన కోరారు,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ నిత్యం సానిటేషన్ నిర్వహించాలని సూచించారు, డైట్ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు, షెడ్యూల్ ప్రకారం విద్యార్థిని, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ప్రతి విద్యార్థి యొక్క హెల్త్ ప్రొఫైల్ విధిగా మెయిoటైన్ చేయాలని ఆదేశించారు,జిల్లాలోనీ ప్రత్యేక అధికారులు అందరూ వారికి కేటాయించిన అన్ని వసతి గృహాలను విధిగా తనిఖీ చేసి నివేదికల సమర్పించాలని ఆయన ఆదేశించారు,

# సిపిఐ పార్టీ జిల్లా నాలుగవ మహాసభను జయప్రదం చేయాలి

**- జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల ముత్యాలు**



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై23:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం జూలై 29న వలిగొండ మండలంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించే సిపిఐ పార్టీ జిల్లా నాలుగో మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రోజున కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల ముత్యాలు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.యాదాద్రి భువనగిరి జిల్లాకు శాశ్వత కరువు నివారణ కోసం చేపట్టిన బస్వాపురం, గంధమల్ల చెరువులను గోదావరి జలాలతో నింపాలని,బిక్కేరు వాగుపై చేపట్టిన భీమలింగం కత్వ,బునాదిగాని కాలువ, మూసీ నదిపై చేపట్టిన పిల్లాయి పెల్లి, ధర్మారెడ్డి పీడర్ చానల్స్,మైనర్ ఇరిగేషన్ పథకాలు మూసీ నదిని ప్రక్షాళన గత ప్రభుత్వం నిధులు కేటాయించకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వము త్వరగా పూర్తిచేసి సాగునీరు అందించాలని కోరారు. సిపిఐ పార్టీ మండల కార్య దర్శి మారుపాక వెంకటేశం,బత్తినీ నరేష్,ఎండి నయుమ్,సుల్తాన్ పురుషోత్తం, జల్ది రాములు,జక్క దయాకర్ రెడ్డి,కసరబోయిన సత్తయ్య, యాస బుచ్చిరెడ్డి, గుర్రం రాజమణి,బొబ్బల లాల్ రెడ్డి, కల్వల నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల కారణంగా ప్రత్యేక బృందాల ఏర్పాటు : ఎస్సై కమలాకర్

**తొలి అక్షరం/ములుగు జిల్లా,జూలై 23 :** గోవిందరావుపేట మండలంలోని ప్రజలకు మరియు రైతులకు మా పోలీసు వారి నుండి చేయు ముఖ్య సూచన ఏమనగా రానున్న రెండు మూడు రోజుల్లో మన ప్రాంతానికి విస్తారంగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నందున అవసరముంటే మాత్రమే ఇంటి నుండి బయటకు రావాలని కరెంటు స్తంభాలు పక్కన ఉన్న తీగలును మరియు ఐరన్ తీగలు పొరపాటున ముట్టుకోవద్దు మరియు తీవ్ర వర్షాలు కారణంగా ఎవరు అయినా పాత ఇంట్లో నివసిస్తుంటే ఈ వర్షానికి నాని కూలెందు కు అవకాశం ఉన్నందున అట్టి ఇళ్లను ఖాళీ చేయగలరు తీవ్రమైన వర్షం వలన వాగులు వంకలు పొంగి ప్రవహిస్తు న్నందున లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అట్టి ప్రాంతాల్ని ఖాళీ చేసి సురక్షిత ప్రదేశాలకి వచ్చి ఉండాలని అనవసరంగా వాగులుని దాటవద్దు ఎక్కడైనా రోడ్ల మీదకి నాళాలు పొంగి ప్రవహిస్తుంటే దాని పైనుండి ఎవరు దాటవద్దు అలాగే అలా ప్రవహిస్తున్న నాళాల గురించి అత్యవసరం ఐతే పస్రా పోలీస్ వారి ప్రత్యేక బృందాలు 24 గంటలు అందుబాటులో ఉంటారు కవున పస్రా పోలీస్ వారికి సమాచారం ఇవ్వగలరు

# సింగూర్ నుండి ఘనాపూర్ ఆనకట్టుకు రావలసిన నీటిని విడుదల చేయాలి

**- మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నాయకుడు శశిధర్ రెడ్డి**



**తొలి అక్షరం/పాపన్నపేట, జులై 23:** సింగూర్ ప్రాజెక్ట్ నుండి ఘనాపూర్ ఆనకట్టకు ప్రతి సంవత్సరం రావలసిన 4.06 టిఎంసి నీటిని నిబంధనల ప్రకారం విడుదల చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి నీ కోరినట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్ సచివాలయంలో మంత్రిని కలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ నీటిని విడతల వారీగా విడుదల చేయాలన్నారు. ఇప్పటికీ జూలై మాసం పూర్తిక వస్తుందని, వేసినటువంటి నారుమడులు అన్ని ఎండిపోకుండా , తక్షణమే నిబంధనల ప్రకారం ఉన్నటువంటి 0.5 టిఎంసి నీటిని వెంటనే విడుదల చేయాలని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కోరినట్లు ఆయన తెలిపారు .

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి: టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి**



**తొలిఅక్షరం/నెక్కొండ జులై 23:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రం నుండి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మరియు నర్సంపేట నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వంగా ఉండాలి . ప్రతి ఒక్కరు ఇంట్లోనే ఉండండి. అవసరమైతేనే బయటకు వెళ్ళండి. వర్షాల వల్ల తడిసిన విద్యుత్ పరికరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ తీగలు,ఇనుప స్తంభాల తాకకుండా జాగ్రత్తగా ఉండండి.ముఖ్యంగా పిల్లలు బయటకు రాకుండా చూసుకోండి. సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి రాష్ట్ర టీపీసీసీ మెంబర్.

# వరంగల్ వెళ్తున్న మాజీమంత్రి హరీష్ రావును ఆలేరు బైపాస్ లో స్వాగతం పలికిన బిఆర్ఎస్ నాయకులు



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జులై 23:** తెలంగాణ రాష్ట్ర తాజామాజీ మంత్రి డబుల్ షూటర్ తన్నీరు హరీష్ రావు హైదరాబాదు నుండి వరంగల్ వెళ్ళు మార్గంలో ఆలేరు బైపాస్ బాహుపేట స్టేజి వద్ద ఆలేరు నియోజకవర్గం టిఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలుకుతూ సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట టిఆర్ఎస్ అధ్యక్షులు కర్రే వెంకటయ్య, ఆలేరు టిఆర్ఎస్ మండల అధ్యక్షులు గంగుల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, టౌన్ అధ్యక్షులు పుట్ట మల్లేష్ గౌడ్, పిఎసి చైర్మన్ మల్లేష్ గౌడ్, టిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు కొలుపుల హరినాథ్ ముదిరాజ్, సిరిగిరి విద్యాసాగర్, కందుల శంకర్ మాదిగ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, రాజు గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# నూతన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా బాధ్యతలు



**తొలి అక్షరం/ మహబూబాబాద్ బ్యూరో జులై 23:** మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా బాధ్యతలు స్వీకరించిన కె.అనిల్ కుమార్, మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ , అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో ల ను కలిసి పూల మొక్క అందజేశారు,కె.అనిల్ కుమార్ గతంలో హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారిగా, మహబూబ్ నగర్, రెవెన్యూ డివిజనల్ అధికారిగా పనిచేశారు.అనంతరం మహబూబాబాద్ రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి, తాసిల్దార్ రాజేశ్వరరావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సునీల్ తదితర సిబ్బంది అనిల్ కుమార్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# పిఆర్సి రిపోర్ట్ తెప్పించకుండా ఉపాధ్యాయ, ఉద్యోగులను అవమానిస్తున్న ప్రభుత్వం



**తొలి అక్షరం/పాపన్నపేట, జులై 23:** రాష్ట్ర ప్రభుత్వం పిఆర్సి రిపోర్ట్ తెప్పించకుండా ఉపాధ్యాయ, ఉద్యోగులను అవమాన పరుస్తుందని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు వెల్లడించారు. ఈ మేరకు వారు పాపన్నపేట డిప్యూటీ తాసిల్దార్ చరణ్ ను కలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు. మూడు దశల పోరాట ఈ మేరకు వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించి బదిలీలతో కూడిన ప్రమోషన్లు ఇవ్వాలని, రెండు సంవత్సరాల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, పెండింగ్ డీఏలను ప్రకటించాలని, ఈ ప్రభుత్వం వచ్చిరెండేళ్లు గడిచిపోయిన తర్వాత పి ఆర్ సి రిపోర్టు తెప్పించకపోవడం ఉద్యోగ ఉపాధ్యాయులను అవమానించడమే నని .Cps రద్దు చేయాలని, 317 జీవో ద్వారా నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేయాలని, మిగిలి ఉన్న పండిట్ ,పి ఈ టి పోస్టులను అప్గ్రేడ్ చేసి ప్రమోషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు హీరలాల్ టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్, బాలరాజు టీపిటిఎఫ్ మండల అధ్యక్షులు, భూషణం యుటిఎఫ్ జిల్లా నాయకులు, శ్రావణ్ కుమార్ యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు రఫిక్, తన్మయి తదితరు పాల్గొన్నారుద

# నేటి విద్యాసంస్థల బందు విజయవంతం: ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్




**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 23:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం లో వామపక్ష విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థల బంధు విజయవంతంరాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్, జూనియర్ కాలేజీలలో నెలకొన్న సమస్యలతో పాటు కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు చేసే ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న పిలుపునిచ్చిన విద్యాసంస్థల బందు విజయవంతం అయిందని అన్నారు సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం.పవన్ చౌహాన్,ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్, మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.బకాయి ఉన్న 8 వేలకోట్ల విద్యార్థుల స్కాలర్ షిప్లు, ఫీజు రీయింబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిత్యవసర సరుకుల ధరలు పెరిగాయి కావున హాస్టల్ విద్యార్థులకు మేస్ఛార్జులు మరియు కాస్మోటిక్ చార్జీలు పెంచాలని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలో మౌలిక సదుపాయాలను కల్పించి, ఆర్టీసీ లో విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ టౌన్ అధ్యక్షాకార్యదర్శులు సుమయిర్, శివ శంకర్ టౌన్ ఉపాధ్యక్షులు అదిల్ మరియు ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్తిక్, ఓంకార్, యూసుఫ్, మజర్, ఆరీఫ్, హర్ష, రెహమాన్, అబ్బు, సుభాన్, ఆరీఫ్, అయాన్, మహేష్, శమి, ఫాయ్యుమ్,మరియు ఏఐఎస్ఎఫ్ నాయకులు సాయి నరేష్ విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# నియోజక అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- **నందిగామ, కొత్తూర్ మండలాల్లో 3.43 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 23:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం నందిగామ మండలంలోని మోత్కుల గూడ గ్రామంలో హెచ్ఎండీఏ నిధులు 1.20 కోట్లతో మోత్కుల గూడ గ్రామం నుంచి కేసారం గ్రామం వరకు బీటీ రోడ్డు,శ్రీనివాసుల గూడ గ్రామంలో హెచ్ఎండీఏ నిధులు 58.0 లక్షలతో శ్రీనివాసుల గూడ గ్రామం నుంచి మస్జిద్ మామిడిపల్లి వరకు సీసీ రోడ్డు, బండోని గూడ గ్రామం నుండి బండోనిగూడ తండా వరకు హెచ్ఎండీఏ నిధులు 1.25 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఆ తరువాత కొత్తూరు మండలంలోని తీగాపూర్ గ్రామంలో 20.0 లక్షల అంచనా వ్యయంతో నిర్మించే డ్వాక్రా భవనం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ మండల అధ్యక్షులు జంగా నర్సింహులు, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ కుమార స్వామి గౌడ్, కొమ్ము కృష్ణ,బండోనిగూడ బుచన్న,నర్సప్ప గూడ మాజీ సర్పంచ్ కృష్ణ,డైరెక్టర్ నర్సింహులు, మల్లేష్,మాజీ ఎంపీటీసీ శేఖర్ గౌడ్,నవాజ్ రెడ్డి,శంకరయ్య, శ్రీశైలం, శివ,నరసింహ, సాములయ్య, మహేందర్,నవీన్ కుమార్ గౌడ్, దర్శన్,రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

# సింగూరు నీటి విడుదల కోసం మంత్రికి వినతి

- **మంత్రి ఉత్తమ్‌కు వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ లేఖ**
- **కిసాన్ కాంగ్రెస్ నేత ప్రభాకర్ రెడ్డి వెల్లడి**



**తొలి అక్షరం/పాపన్నపేట, 23 జులై:** సాగు కోసం ఎగువ సింగూరు ప్రాజెక్టు నుంచి వనదుర్గా (ఘణపురం) ప్రాజెక్టుకు నీటిని వెంటనే విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి బుధవారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి లేఖ రాసినట్లు కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మెదక్ జిల్లా అధ్యక్షులు ప్రబతి ప్రభాకర్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆయకట్టు కింద ఉన్న రైతులు వరినాట్లు వేసుకోవడానికి 0.3 టీఎంసీలు చొప్పున దశలవారీగా విడుదల చేయాలని, ప్రస్తుతం ప్రాజెక్టులో 19 టిఎంసిల నీరు నిల్వ ఉన్న విషయాన్ని లేఖలో పేర్కొన్నారని తెలిపారు. ఇదివరకే మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సింగూరు నీటి విడుదల కోసం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో పాటు, జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ ను సైతం కోరినట్లు ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు.


# రంగారెడ్డి జిల్లా ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ పూరిస్తాయి నూతన కమిటీ ఎన్నిక



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 23:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్ లో ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా జిల్లెల్ల రమేష్ ని ఎన్నుకోవడం జరిగింది. అనంతరం తను మాట్లాడుతూ జిల్లాలో మార్షల్ ఆర్ట్స్ కు సంబంధించి అన్ని కార్యక్రమాలను ముందుండి విజయవంతం చేస్తానని తెలిపారు. అలాగే నామీద నమ్మకముండి అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు కమిటీ మెంబర్స్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పూర్తిస్థాయి నూతన కమిటీగా ఉపాధ్యక్షులు గా శివకృష్ణ గౌడ్, కార్యదర్శి షేక్ హాజీ, కోశాధికారి సాయినాథ్ యాదవ్, జాయింట్ సెక్రెటరీ బాలరాజు, టోర్నమెంట్ హెడ్ అడ్వైజర్లు నరసింహ, నందు, కమిటీ ఇంచార్జ్ లు కే.వెంకటేష్,వేంకటేష్, మల్లేష్, లింగం, కమిటీ మెంబర్స్ రాములు, బాలు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూల గూడ గ్రామంలో బిటి రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

- **షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"**
- **రూ. 1.20 కోట్లతో 1.5 కిలోమీటర్ బిటి రోడ్డు నిర్మాణ శంకుస్థాపన పనులు**
- **తరలివచ్చిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,గ్రామ ప్రజలు**





**తొలి అక్షరం/నందిగామ, జులై 23:** రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మోత్కూల గూడ గ్రామ నుంచి కేసారం వరకు రూ.1.20 కోట్ల నిధులతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి చెందాలి పూర్తిగా గ్రామాలు అనే సదుద్దేశంతో మోత్కూల గూడ గ్రామ నుండి కేసారం వరకు లింకు రోడ్డు చేయడం ద్వారా మోత్కల గూడ గ్రామ ప్రజలు, కేసారం గ్రామ రైతులు ఎన్నో రోజుల నుంచి రోడ్డు సౌకర్యం సరిగా లేనందున ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ కి వెళ్లి రావడానికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. దిన స్థితిలో ఉన్న రోడ్డును బీటీ రోడ్డు గా మారుస్తున్నాము. అందులోనే భాగంగానే వివిధ గ్రామాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నాము.కావున మొట్టమొదటిగా నందిగామ మండలం మోత్కూల గూడ గ్రామంలో బీటీ రోడ్డు పనులు శంకుస్థాపన చేయడం జరిగింది.రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా దూసుకుపోతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నందిగామ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, మోత్కూల గూడ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,గ్రామ ప్రజలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భారత స్వాతంత్ర ముద్దుబిడ్డలకు నివాళులు

- **ఘనంగా నివాళులర్పించిన నేతాజీ సేవా సమితి బాధ్యులు..**



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జులై 23:** నేతాజీ సేవా సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ జూలై 23 భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగిన రోజు.లోకమాన్య బాల్ గంగాధర్ తిలక్ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో తొలితరం నాయకుల్లో ఒకరు. ఆయన 'స్వరాజ్యం నా జన్మహక్కు అన్న నినాదం యావత్ భారతాన్ని ఉద్యమితం చేసింది.చంద్రశేఖర్ ఆజాద్ 'నేను ఆజాద్‌గా పుట్టాను – ఆజాద్‌గానే చస్తాను' అనే మాటలతో యువతలో జ్వాల రగిలించారు.కెప్టెన్ లక్ష్మీ సేహగాల్ నేతాజీ ఐ ఎన్ ఏ లో 'ఝాన్సీ రాణి రెజిమెంట్'కు నాయకత్వం వహించిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధురాలు. భారత స్వాతంత్ర్య పోరాటంలో మహిళల బలాన్ని ప్రపంచానికి చూపిన వీరనారి." అని సందేశం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నేతాజీ సేవా సమితి ఉపాధ్యక్షులు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కుదురుపాక వివేక్, ఉప కార్యదర్శి కురియావుల గంగాధర్, కోశాధికారి మైసా రోహిత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోనగిరి లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓబ్బిలి శెట్టి రామకృష్ణ, ఆర్గనైజింగ్ కన్వీనర్ సామ శ్రీనివాస్,చిటిమల్ల రఘు ,మాజీ సైనికులు కొమ్ము కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

# జూలై 30వ తేదిన బిఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం

- **పాటిమట్ల లక్ష్మినరసింహ పంక్షన్ హాల్లో నిర్వహించడం జరుగుతుంది**
- **బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు విజయవంతం చేయండి**
- **అడ్డగూడూర్ మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి**



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జులై 23:** తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్ కుమార్ ఆదేశాల మేరకు జూలై 30వ తేదిన పాటిమట్లా గ్రామంలో గల లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్లో ఉదయం10 గంటలకు బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిధిగా మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి విచ్చేయుచున్నారు. కావున అడ్డగూడూర్ మండల పరిసర ప్రాంతాల ప్రజలు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు అభిమానులు వివిధ గ్రామ శాఖల అధ్యక్ష కార్యదర్శులు, మాజీ సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, యంపిటీసీలు, నాయకులు ,యువకులు అధిక సంఖ్యలో పాల్గొనీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని.బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏసీబీ సోదాలను స్వాగతిస్తున్నాం

**- ఎస్సి, ఎస్టీ, బీసీ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు పొన్నాల యుగేందర్**



తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జూలై 23: మహబూబాబాద్ జిల్లా లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న అవినీతిపై ఏసీబీ దాడులు జరిగాయి. వాటిని ఎస్సి, ఎస్టీ బీసీ సంఘం స్వాగతిస్తుంది. ఎస్సి ఎస్టీ, బీసీ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు పొన్నాల యుగేందర్ మాట్లాడుతూ మహబూబాబాద్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో అనేక రకాల అవినీతి అక్రమాలు జరుగుతున్నాయి.విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకుండా, మెను పాటించకుండా నాసిరకమైన, నాణ్యతలేని ఫుడ్ అందిస్తున్నారని విద్యార్థుల మౌలిక సదుపాయాలు కూడా లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం వ్యక్తం చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో జరిగేటువంటి అవినీతిపై ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. ఏ రకమైన అవినీతి జరుగుతుందో అర్థం చేసుకోవాలని వారన్నారు. మహబూబాబాద్ జిల్లా పరిధిలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో కొంతమంది హెచ్ఎంలు,వార్డెన్లు మహబూబాబాద్ కే పరిమితమైపోయారని అన్నారు.అక్రమ డిప్యుటేషన్ల పేరుతో వారి దందా కొనసాగుతుందని అన్నారు. పది సంవత్సరాల కాలంలో చూసుకున్నట్లయితే మహబూబాబాద్ పరిధిలోనే హెచ్ఎంలు, వార్డెన్లుగా కొనసాగుతున్న హాస్టలను గుర్తించి అధికారుల రికార్డులను సరేండ్ చేసుకోవాలని వారన్నారు. అక్రమంగా విద్యార్థుల సొమ్ముకాజేస్తూ అనేక రకాల అవినీతి అక్రమాలకు పాల్పడుతూ ధనార్జన ధ్యేయంగా పనిచేస్తున్నటువంటి కొంతమంది వార్డెన్లు, హెడ్మాస్టర్లు ఉన్నారని,ఆస్తులపై విచారణ కొనసాగించాలని, అవినీతిపరులను గుర్తించి తప్పు చేసిన వారికి తగిన శిక్ష పడేలాగ చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. మహబూబాబాద్ ఆశ్రమ పాఠశాలలో జరిగే అవినీతిపై ఏటూర్ నాగారం, భద్రాచలం పిఒలు గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పది ఏళ్ల నుండి పనిచేస్తున్న వారిని గుర్తించి వారి అవినీతిని బట్ట బయలు చేయాలని ప్రభుత్వ రంగాన్ని కోరారు. విద్యార్థుల పొట్ట కొట్టి ఎంతటి వారినైనా శిక్షించాల్సిందేనని డిమాండ్ చేశారు. డిప్యూటేషన్ల పేరుతో లక్షల రూపాలు చేతులు మారుతున్నాయి. పేద విద్యార్థుల పరిస్థితి ని గమనించి వారికి అందాల్సిన పౌష్టిక ఆహారం అందించాలని అవినీతి పరులను వదిలిపెట్టొద్దు అని ఇంకా కొన్ని పాఠశాలలు ఉన్నాయి. వాటిపై సోదాలు చేయాలనీ వారు కోరారు.

# వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎండు గంజాయి పట్టివేత






తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జూలై 23: ఉదయము 5.30 గంటల సమయములో నెల్లికుదురు మండలం ధూర్జాతవాని తండా క్రాస్ రోడ్ వద్ద వాహనములు తనిఖీ చేస్తుండగా రెండు వాహనములు ఆటో, ఎర్టిగా కార్ అనుమానాస్పదముగా ఉండడంతో అట్టి వాహనములు తనిఖీ చెయ్యగా ఆటో లో 2 ప్యాకెట్లలు (4 కిలోలు 100 గ్రాములు) ఎర్టిగా వాహనములో 10 ప్యాకెట్లలు (21 కిలోలు) మొత్తం సుమారుగా 25 కేజీలు ఎండు గంజాయి రవాణా చేసిన ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించిన తొర్రూరు సిఐ టి గణేష్, వాటి విలువ 12, 55, 000/- ఉంటుంది.అట్టి వ్యక్తుల వివరాలు తెలుసుకొనగ 1. మేకపోతుల వేణుగోపాల్ రెడ్డి తండ్రి అప్పిరెడ్డి గ్రామము ఆలేరు, 2 ఉప్పుగండ్ల ప్రభాకర్ తండ్రి రామానందం గ్రామము పాల్వంచ భద్రాద్రి కొత్తగూడెం డిస్టిక్, 3 భారీ రాజబాబు తండ్రి ఎల్లమయ్య గ్రామము చిత్తూరుకొండ మల్కానగిరి డిస్ట్రిక్ట్ ఒడిస స్టేట్, 4. దీపక్ పటేల్ తండ్రి బాలు పటేల్ గ్రామము మల్కానగిరి డిస్ట్రిక్ట్ ఒడిస్సా స్టేట్, 5 రోహిత్ కుమార్ జస్వాల్ తండ్రి రామ్ లఖన్ లాల్ జస్వాల్ గ్రామము సెలహో తగునా పూర్ మధ్యప్రదేశ్, 6 రంకిరెడ్డి వెంకటస్వామి తండ్రి సుబ్బారావు గ్రామము బల్లవారి స్ట్రీట్ రాజమండ్రి గోదావరి డిస్ట్రిక్ట్, 7. రామ్ లాల్ తండ్రి గోపాల్ రాజస్థాన్ స్టేట్ లు జైలులో ఒకరికొకరు పరిచయం అక్రమమైన మార్గంలో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో ఓడిస్స నుండి హైదరాబాద్ కు ఎండు గంజాయి తీసుకుని వెళ్తుంటే నెల్లికుదురు పోలీస్లు పట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లికుదురు ఎస్ హెచ్ ఓ రమేష్ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాళ్ళవాగును పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



తొలి అక్షరం/ములుగు జూలై 23 :జిల్లా, మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో పనిచేసి ఏటువంటి నష్టం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు.బుదవారం ములుగు జిల్లా వెంకటాపురం మండల యాకన్న గూడెం రాళ్ళ వాగు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు మరమ్మతులకు గురైన వంతెనను కలెక్టర్ దివాకర టి.ఎస్. పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎగువ కురిసిన అధిక వర్షాలతో రాళ్లవాగు సమీపంలో తాత్కాలికంగా నిర్మించిన రహదారి వరద నీటి ప్రవాహంతో కొట్టుకుపోయిందని, ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించిందని తెలిపారు. వచ్చే మూడు రోజులలో అధిక వర్షాలు పడే అవకాశం ఉందని ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాగులు, వంకలు, చెరువులు,గోదావరి ఉగ్ర రూపం దాల్చి ప్రవహించే అవకాశం ఉందని వరద నీరు చేరి రోడ్లు పై వచ్చినప్పుడు ప్రజలు, వాహనాదారులు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరం అయితే తప్ప బయట కు రావద్దని, గోదావరి ముంపు ప్రాంతాలలో ఉన్న ప్రజల సౌకర్యార్థం పునరవస కేంద్రం ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారుల ను ఆదేశించారు. వర్షాల ప్రభావంతో పురాతన కాలం నాటి శిథిలావస్థకు చేరీన ఇళ్లల్లో ఉంటున్న వారిని పునరావస కేంద్రాలకు తరలించాలనీ అవసరమైన బోటు రెస్క్యూ టీమ్ సిద్ధం గా ఏటూరు నాగారం అందు బాటులో ఉన్నదని, గర్భిణి స్త్రీలు స్థానిక ఆసుపత్రి తరలించాలనీ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ , దోమల మందు పిచికారి చేయాలనీ గ్రామపంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, జిల్లా మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి ఏటువంటి నష్టం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సంజీవ రావు, మండల అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ -పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల పెండింగ్ వేతనాలను వెంటనే మంజూరు చేయాలి

**● నెక్కొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారికి వినతి**



తొలి అక్షరం/నెక్కొండ జూలై 23: వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పరిషత్ అభివృద్ధి అధికారికి ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు పెండింగ్ లో ఉన్న వేతనాలను వెంటనే మంజూరు చేయటకై విన్నవించడం. మరియు వారం రోజులలో ఈ సమస్య పరిష్కరించమని యెడల విధులు బహిష్కరిస్తున్నట్లు ముందస్తుగా తమరికి తెలియజేయడం జరిగింది. పై విషయానుసారం తమతో మనవి చేయునది,ఏమనగా ఈ లేఖను జిల్లా ఈ పంచాయతీల సంఘం కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలను మీ దృష్టికి తీసుకొస్తున్నాము. తెలంగాణ రాష్ట్రంలో 32 జిల్లాల్లోని 1579 మంది ఈ -పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లుగా మండల స్థాయిలో విధులో నిర్వహిస్తున్నాము. కాగా రాష్ట్రంలో వీధులలో ఉన్న ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు ఈమధ్య కాలంగా అనగా జనవరి 2025 నుండి మా వేతనాలు కమిషనర్ కార్యాలయం హైదరాబాదు నుండి పొందుతున్నాము. ఈ క్రమంలో ఈ యొక్క వేదనములు 22,750 రూపాయలకు బదులుగా 19500 /-మా ఖాతాలో జమ చేయుచున్నారు. కాగా వేతనములు తగ్గించి అందించడం వలన మేము ఆర్థికంగా నష్టపోతున్నామని, తమకి సవినయంగా తెలియజేయుచున్నాము.ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లుగా మేము 2015 నుండి విధులు నిర్వహిస్తున్నాము. ప్రభుత్వం వారు మాకు ఇంతవరకు ఎలాంటి హెచ్ ఆర్ ఉద్యోగ భద్రత కానీ ఎలాంటి సౌకర్యాలు కానీ కల్పించడం లేదు. కావున దయామయులైన తమకు మా చిరు ఉద్యోగుల ఆర్థిక పరిస్థితిని పరిగణలోకి తీసుకొని, పది సంవత్సరాల నుండి మేము ఎదురు చూసే హెచ్ ఆర్ పాలసీ విధానాన్ని వెంటనే అమలు అయ్యే విధంగా తమరి ద్వారా పంచ ప్రభుత్వానికి నివేదిక పంపాలని, మరియు వెంటనే పెండింగ్లో ఉన్న ఏప్రిల్,మే,జూన్ 2025 వరకు గల మూడు నెలల వేతనాలను చెల్లించాలని కోరనైనది. ఈ నేపథ్యంలో తేదీ 23.7.2025 నుండి శాంతియుతంగా మా సమస్యలను ఉన్నత అధికారులకు గమనించేలా చేయడానికి ఈ పంచాయతీ ఆపరేటర్ సంఘం తమతో మనవి చేసుకుంటున్నాము.

# రామన్నపేటలో కాలుష్య సిమెంట్ పరిశ్రమ నిర్మిస్తే మరో పోరాటం తప్పదు

**● సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**



తొలి అక్షరం/రామన్నపేట జూలై 23: రామన్నపేటలో ఆదాని అంబుజా సిమెంటు పరిశ్రమ నెలకొల్పితే మరో ప్రతిఘటనా పోరాటం తప్పదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ఈరోజు హైదరాబాద్ నుండి సూర్యాపేట వెళుతున్న క్రమంలో స్థానిక రామన్నపేట సుభాస్ సెంటర్లో సిపిఎం మండల నాయకులను కలిసి ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశీయ బడా పెట్టుబడిదారునైనా ఆదాని సిమెంట్ పరిశ్రమ నెలకొల్పి పచ్చని పల్లెల్లో కాలుష్య భూతాన్ని పెంచి పోషించాలని చూస్తే కమ్యూనిస్టులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ప్రజా అభిప్రాయ సేకరణలో మండల వ్యాప్తంగా ప్రజలు ముక్తకంఠంగా వ్యతిరేకించినా మళ్లీ దొడ్డి దారిన వచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని. పోరాటాల పురిటి గడ్డ అయిన రామన్నపేట ప్రజలు మరోసారి తిరగబడి ప్రతిఘటిస్తారని అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన రిపోర్టుని బహిర్గతం చేయాలని, వెంటనే సిమెంట్ పరిశ్రమను రద్దు చేస్తున్నట్లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలని అన్నారు. పరిశ్రమ ఏర్పాటు చేయవద్దని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని, రాష్ట్ర ముఖ్యమంత్రిని త్వరలోనే కలుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యుడు బల్గూరి అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయిని ఆనంద్, మండల కమిటీ సభ్యులు గొరిగే సోములు, పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటపాటు శివకుమార్,డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు శానకొండ రామచంద్రం, మెట్టు శ్రవణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, ఆముద ఆంజనేయులు, భావనలపల్లి సత్యం,కునూరు గణేష్, రాసాల రమేష్, పొట్లచెరువు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిర్బంధాలతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరు

**● ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్**

**● రామన్నపేటలో రాష్ట్రవ్యాప్త బంద్ విజయవంతం**

తొలి అక్షరం/రామన్నపేట జూలై 23: నిర్బంధాలతో అక్రమ, కేసులతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరని ప్రభుత్వం అవలంబించే విద్యా వ్యతిరేక విధానాలపై ఎస్ఎఫ్ఐ ఉద్యమిస్తుందని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్ అన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల రాష్ట్ర వ్యాప్త బంద్ రామన్నపేటలో సంపూర్ణ బంద్ జరిగింది. మండలంలో ఉన్న కళాశాల పాఠశాలలు స్వచ్ఛందంగా బందు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 నెలల కాంగ్రెస్ పాలనలో విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం జరగడంలేదని, కనీసం రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని కూడా కేటాయించలేదని అన్నారు. గత ఆరు సంవత్సరాల నుండి విద్యార్థులకు రావలసిన 8300 కోట్ల రూపాయల ఉపకార వేతనాలు బోధన రుసుములను విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ విద్యార్థులను మోసగిస్తుందని అన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడిలో విద్యార్థులపై పోలీసులు పాషవికంగా లాఠీ చార్జి నిర్వహించి అరెస్టు చేసి రాత్రి వరకు పోలీస్ స్టేషన్లో నిర్బందించడం అప్రజాస్వామికమని అన్నారు. బందు జరగకుండా విద్యార్థి నాయకులని అన్ని మండలాల్లో అరెస్టులు చేసి నా కూడా విద్యార్థుల స్వచ్ఛందంగా బందు పాటించారని తెలియజేశారు అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరని తెలిపారు.ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకురాలు పొట్లచెరువు గాయత్రి, నాయకులు భూక్య సంతోష్ నాయక్, బత్తిని సందీప్, తాటిపాముల ఉదయ్, యాదాసు చరణ్, గట్టు నరేష్, సిల్వర్ రమేష్, అక్షిత, వందన, నవదీప్, కొమ్ము నరేష్, శాంతి కుమార్, వల్లమల్ల నరేష్, యాదాస్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.




# తాటిపాముల విష్ణువర్ధన్‌కి శ్రద్ధాంజలి

**- ఘటించిన టిపిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి**



తొలిఅక్షరం/నెక్కొండ జూలై 23: వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణ వాస్తవ్యులు తాటిపాముల వెంకన్న కుమారుడు విష్ణు వర్ధన్ గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదం లో మరణించగా, వారి దశ:దిన కార్యక్రమం కావున వారి చిత్ర పటానికి పులమాల వేసి శ్రద్ధాంజలి గటించిన టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్,ప్రధాన కార్యదర్శి ఆవుల శ్రీనివాస్,నెక్కొండ మార్కెట్ డైరెక్టర్ లు రావుల మహిపాల్ రెడ్డి, బొమ్మెరబోయిన రమేష్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మూసిన శ్రీనివాస్, నేతుల సారంగం పాల్గొన్నారు.

# రైతులకు ఏరువాక కార్డుల పంపిణీ




తొలిఅక్షరం/నెక్కొండ జూలై 23:వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రం లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో అందుబాటులో ఉన్న పట్టణ రైతులకు ఏరువాక కార్డులను పంపిణీ చేసిన. నెక్కొండ పిఎసిఎస్ చైర్మన్ మారం రాము . మరియు కార్యక్రమంలో ఏవో నాగరాజు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు చల్లా చెన్నకేశవరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు సొరపు శ్రీనివాస్, లావుడ్య యాకూబ్, జంగిలి లక్ష్మి, రెడ్డబోయిన కుమారస్వామి, సీఈఓ మోడెం సురేష్, రైతులు చల్లా కిషన్ రెడ్డి, గరికపాటి కృష్ణారావు, మల్లంపాటి సంజీవరెడ్డి, రావుల భాస్కర్ రెడ్డి, పొశాల జగన్, పొశాల వెంకన్న, నంగునూరి శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుని అందచేసిన టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి



తొలిఅక్షరం/నెక్కొండ జూలై 23:వరంగల్ జిల్లా నెక్కొండ మండలం ముదిగొండ గ్రామ నివాసిజాటోత్ అంజలి డాటరాఫ్ ఎల్లయ్య కి ముఖ్య మంత్రి సహాయం కింద 36000 వేల రూపాయల చెక్కు ని అందచేసిన టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి,ఈ కార్యక్రమం లో నెక్కొండ మార్కెట్ డైరెక్టర్ లు మహ్మద్ ఖలీల్,రావుల మహిపాల్ రెడ్డి,ముదిగొండ గ్రామ పార్టీ అధ్యక్షులు మండల కార్యదర్శి అనుముల శ్రీధర్ రెడ్డి,నెక్కొండ మండల మైనారిటీ సభ్యులు షైక్ షబ్బీర్,మహమ్మద్ అన్వర్,మహ్మద్ ఆఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి




తొలి అక్షరం/రామన్నపేట జూలై 23: శివనేనిగూడెం గ్రామానికి చెందినా అమరోజు సాయి చంద్ స్వంత అన్న అయిన అమరోజు సాయి బాను, 30 సంవత్సరం, అను అతను తేది 22.07.2025 రోజు ఉదయం 10.00 గంటలకు రామన్నపేట కు పని నిమిత్తం వచ్చి తిరిగి ఇంటికి ప్యాసింజర్ ఆటో ఏపీ 24 వై 9094 వెనుకాల కూర్చొని వెళ్ళుతుండగా అంబేద్కర్ బొమ్మ దగ్గర నుండి వేలుతుండగా ఆటో డ్రైవర్ బచ్చ వెంకటేష్ ఆటో ను అతివేగంగా, అజాగ్రతగా నడపడం వల్ల తలకు లోపటి గాయం అయి ముక్కులో నుండి రక్తం బయటకు వచ్చినది తరువాత చుట్టుపక్కల వాళ్ళు వెంటనే 108 అంబులేన్స్ లో కామినేని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినారని డాక్టర్ లు నిర్ధారించినారని పిర్యాదు రాగా కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాము రామన్నపేట ఎస్సై డి. నాగరాజు పత్రికా ప్రకటనలలో తెలిపినారు

# ఇందిరమ్మ ఇండ్ల బిల్లులపై అధికారుల నిర్లక్ష్యం

- మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ రామన్నపేట బిఆర్ఎస్ నాయకులుకంభంపాటి శ్రీనివాసులు గౌడ్





| S.No | Mandal/Municipality | Basement Level Total | AE Approved | DEE Approved | PD Approved | Collector Approved | Walling Total | AE Approved | DEE Approved | PD Approved | Collector Approved |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | Bogaram | 1 | 1 | 1 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | |
| 2 | Janampally | 3 | 3 | 3 | 1 | 1 | 0 | 0 | 0 | 0 | |
| 3 | Kommaigudem | 1 | 1 | 1 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | |
| 4 | Kothagudem | 1 | 1 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | |
| 5 | Nidhanpally | 1 | 1 | 1 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | |
| 6 | Uttatoor | 46 | 44 | 40 | 40 | 40 | 18 | 18 | 18 | 18 | |
| | Total | 53 | 51 | 46 | 41 | 41 | 18 | 18 | 18 | 18 | |



**తొలి అక్షరం/రామన్నపేట జులై 23:** రామన్నపేట మండలంలో ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆరు గ్యారంటీలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కార్యక్రమంలో అధికారులు నిర్లక్ష్య వహిస్తున్నారని ఒకవైపు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే మంత్రులు ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇండ్ల బిల్లు తమ అకౌంట్లో పడుతుందని చెప్పిన, అధికారులు మాత్రం దాన్ని పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నిదానపల్లి గ్రామంలో రెండో విడత కార్యక్రమంలో బత్తిని కలమ్మ బీస్మెంట్ లెవెల్ ఫోటో 10 వ తారీకు గురువారం పంచాయతీ కార్యదర్శి, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీరింగ్ ఫోటోలు అప్లోడ్ చేసిన అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటివరకు రెండు వారాలు దాటిన బిల్లు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు.ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలి మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు అప్పుల పాలు కాకుండా చూడాలని తెలిపినారు

## మిరియం చిల్డ్రన్స్ హోమ్‌ని సందర్శించిన దామరచర్ల సిడిపిఓ చంద్రకళ



**తొలి అక్షరం/మిర్యాలగూడ,జులై 23:** దామరచర్ల ప్రాజెక్టు పరిధిలోగల వేములపల్లి మండలం శెట్టిపాలెం పరిధిలో మిరియం చిల్డ్రన్స్ హోం నీ సిడిపిఓ చంద్రకళ , విజిట్ చేయడం జరిగింది .అక్కడ పిల్లలను అన్ని వివరములు అడిగి తెలుసుకున్నారు కిచెన్ ఏరియా రూమ్స్ అన్ని చెక్ చేయడం జరిగింది. డిసిపియు లీగల్ ఆఫీసర్ వెంకన్న, రమణి ,సూపర్వైజర్ పరిమి రజిని, హోమ్ మేనేజర్ సరోజినీ పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య చికిత్స శిబిరం విజయవంతం



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 23:**విట్యాల గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ శారద నెహ్రూ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి వారికి మందులు ఇవ్వడం జరిగింది. అలాగే మందులతో తగ్గని వారికి పరీక్షలు నిర్వహించి వారికి హాస్పిటల్ యందు ఉచిత వైద్య సేవలు అందిస్తామని రిఫరెన్స్ చేయడం జరిగింది. గుండె వ్యాధి , జనరల్ మెడిసిన్ , ఊపిరితితుల వ్యాధి , చిన్న పిల్లలకు , ప్రసూతి వారికి , గర్భకోశ వ్యాధులు , ఆర్థోపెటిక్ , చెవి గొంతు, చర్మ వ్యాధులు , దంత విభాగం, మానసిక రోగులు ఇలా సమస్యలు ఉన్న వారికి గ్రామంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించాడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివోఏ మొయినుద్దీన్, రాములు , ఆర్ శంకర్, నర్సింలు, రవీందర్ గౌడ్, మరియు వైద్య సిబ్బంది , గ్రామస్తులు పాల్గొన్నారు.



# మహిళా శక్తి నువ్వు సమాజానికి నాంది

● ఘనంగా మహిళా శక్తి సంబరాలు.! ● 200 కోట్ల మంది మహాలక్ష్మిలు ప్రయాణం ● డిపోకు కొత్తగా 52 బస్సులు. ● షాద్ నగర్ డిపోలో ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో సంబరాలు

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 23:** మహిళలను ఉన్నత స్థాయిలో నిలబెట్టడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు నియోజకవర్గం ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్.మహిళల ఉచిత ప్రయాణం విజయవంతంగా కొనసాగుతున్న సందర్భంగా మహాలక్ష్మి పథకం అమలులో భాగంగా నేడు (బుధవారం) రాష్ట్ర వ్యాప్తంగా 97 ఆర్టిసి డిపోలతోపాటు 341 బస్ స్టేష న్లలో సంబురాలు,ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం పిలుపుమేరకు గాను బుధవారం షాద్ నగర్ డిపో లో ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,,ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ ప్రత్యేక పాత్ర పోషించిందని,ఆర్టీసీ సేవలను కొనియాడుతూ గుర్తు చేసుకున్నారు.సృష్టికి మూలం మహిళా..మహిళలకే అధిక ప్రాధాన్యత ఇస్తూన్నారని ఎమ్మెల్యే తెలిపారు..ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రజాపాలన ప్రభుత్వంలో అమలు చేసిన మొట్టమొదటి మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 9 డిసెంబర్ 2023 నుండి విజయవంతంగా అమ లవుతుందన్నారు. ఇప్పటి వరకు 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని.. రూ.6700 కోట్ల విలువైన ప్రయాణాన్ని మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని తెలిపారు. ఆర్టీసికి మహిళా ప్రయాణికుల రియంబర్స్మెంట్ ను ప్రభుత్వం ఎప్పటికప్పుడు



చెల్లిస్తుందన్నారు.సంస్థలో ఎలాంటి ఆటంకాలు లేకుండా నూతన బస్సుల కొనుగోలు చేస్తూ మహాలక్ష్మి పథకం విజయవంతం కోసం కృషి చేస్తున్న ఆర్టీసి డ్రైవర్లు,కండక్టర్లు,శ్రామిక్ లు,ఇతర సిబ్బంది,అధికారులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ అభి నందించారనీ ఎమ్మెల్యే శంకర్ గుర్తు చేశారు.సంస్థ పరిరక్షణ,ప్రయాణికుల భద్రత,ఉద్యోగుల సంక్షేమం ప్రథమ కర్తవ్యంగా ముందుకు పోతున్నామని ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు.ఉచిత ప్రయాణం ద్వారా మహిళా సాధికారత దిశగా అడుగులు వడుతున్నాయని.. దూర ప్రాంత ప్రజలు కూడా నిత్యం నగరానికి వచ్చి ఉద్యోగాలు చేస్తూ ఆర్టీసీ వృద్ధి సాధించడం అభినందనీయమన్నారు. ప్రతి మహిళా నెలకు రూ. 45 వేల వరకు ఉచిత ప్రయాణం ద్వారా ఆదా చేసుకుంటూన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రయాణం పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా 97 బస్సు డిపోలు,341 బస్ స్టేషన్లలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం అదేవిధంగా ఆర్టీసీ శాఖ మంత్రి పొన్న ప్రభాకర్ పిలుపునిచ్చినట్టు తెలిపారు. అందులో భాగంగా బస్ స్టేషన్లు,డిపోలు మొదలైన వాటిలో బ్యానర్ల ప్రదర్శన చేయాలని.. అన్ని డిపోల్లో ముఖ్యమైన బస్ స్టేషన్లలో



సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సంబురాల కార్యక్రమాల్లో స్థానిక ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమావేశానికి ఆహ్వానించాలని.. మహిళా ప్రయాణీకులతోపాటు ప్రయాణికుల ప్రసంగాలను ఏర్పాటు చేయడం కూరగాయల విక్రేతలు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పాఠశాల, కళాశాల విద్యార్థులు, వ్యాపార మహిళలు, పట్టణ ఆసుపత్రులకు మెరుగైన చికిత్స కోసం వెళ్లే మహిళలు, యాత్రికులు వంటి వివిధ వర్గాలకు చెందిన వారు తమ ప్రసంగాలలో తమ ప్రయాణ అనుభవాలను పంచుకోవాలన్నారు. డిపోలు, ముఖ్యమైన బస్ స్టేషన్లలో మహిళా ప్రయాణికులను శాలువా, బహుమతితో సత్కరించనున్నట్టు తెలిపారు.మహాలక్ష్మి ఉచిత ప్రయాణ పథకం, మహిళా సాధికారత మొదలైన అంశాలపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాస రచన, రంగోలి, చిత్రలేఖనం పోటీలను నిర్వహించాలన్నారు. పుస్తకాలు, వాటర్ బాటిళ్లు, పెన్ సెట్లు మొదలైన బహుమతులతో 5 మంది బహుమతి గ్రహీతలను సత్కరించాలని సూచించారు. పథకం విజయవంతానికి దోహదపడిన ప్రతి డిపోలోని 5 మంది ఉత్తమ డ్రైవర్లు, 5 మంది ఉత్తమ కండక్టర్లతో పాటు ట్రాఫిక్ గైడ్లు, భద్రతా సిబ్బందిని సత్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఉష,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,మున్సిపాలిటీ,టౌన్,ఫరూక్ నగర్ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా సంఘాల అధ్యక్షులు,ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, తదితరులు హాజరయ్యారు.

# ఎవరైనా అడ్డొస్తే చంపేస్తా..!

● దూసకల్ మాజీ సర్పంచ్ చౌలపల్లి మురళీధర్ రెడ్డి బెదిరింపులు ● గౌడ సంఘం సమాధుల తొలగింపు... ● ఈత చెట్లు, తూము కాలువ ధ్వంసం చేశారని గౌడ సంఘం ఆందోళన ● షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో దూసకల్ గ్రామ గౌడ సంఘం ఫిర్యాదు

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 23:** ఎవరైనా తనకు అడ్డొస్తే చంపేస్తానని ముత్తాతల నాటి దూసకల్ గౌడ సంఘం సమాధులను ధ్వంసం చేయడమే కాకుండా తమ స్థలంలో ఉన్న ఈత చెట్లు, చెరువు తూము కాలువలను గ్రామ మాజీ సర్పంచ్ చౌలపల్లి మురళీధర్ రెడ్డి బెదిరింపులకు దిగుతున్నాడని ఆరోపిస్తూ గ్రామ గౌడ సంఘం నాయకులు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మంగళవారం దూసకల్ గ్రామానికి చెందిన గౌడ సంఘం నాయకులు సత్యనారాయణ గౌడ్, రామస్వామి గౌడ్, గడిగే ఆంజనేయులు గౌడ్, యాదయ్య గౌడ్, అల్వాల కుమార్ గౌడ్ బూర్గుల బాలయ్య గౌడ్ ఈదులపల్లి విష్ణు గౌడ్, ఈదులపల్లి శ్రీకాంత్ గౌడ్ ఈదులపల్లి అంజయ్య గౌడ్, అల్వాల శేఖర్ గౌడ్, గడిగే ఆంజనేయులు గౌడ్ తదితరులు పెద్ద



ఎత్తున తరలివచ్చి పోలీస్ స్టేషన్లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. సదర్ ఫిర్యాదు ప్రతిని మీడియా కార్యాలయాల్లో స్వయంగా వచ్చి అందజేశారు. పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం అదేవిధంగా బాధితులు పేర్కొంటున్న విధంగా.. దూసకల్ గ్రామంలో సర్వేనెంబర్ 81 లో వందల నాటి సంవత్సరాల క్రితం తమ గౌడ సంఘం పెద్దలు ఏర్పాటు చేసుకున్న ఎనిమిది గుంటల పొలంలో గౌడ కులస్తుల సమాధులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ స్థలంలో ఈత చెట్లతో పాటు చెరువు తూము కాలువ కూడా ఉండేదని దీనిని ఈనెల 16వ తేదీన దూసకల్ గ్రామ మాజీ సర్పంచ్ చౌలపల్లి మురళీధర్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా సమాధులతోపాటు వీటిని ధ్వంసం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. గడిగే సాయిలు అనే వ్యక్తి సమాధిని కూడా ధ్వసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ విషయం తెలియగానే గ్రామ



పెద్దలు సత్యనారాయణ గౌడ్ మరియు అల్వాల దశరథ్ గౌడ్ అలవాల కుమార్ గౌడ్ కొంతమంది కలిసి వెళ్లి మురళీధర్ రెడ్డిని ఎందుకు సమాధులు ధ్వంసం చేశారని, తూము కాలువను పాడుచేసి ఈత చెట్లను నాశనం చేశారని ప్రశ్నించగా అతను స్పందిస్తూ ఏమి చేసుకుంటారో చేసుకోండి నాకు అడ్డు వస్తే చంపేస్తా అని బెదిరించినాడు అని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామ పెద్దలు సైతం ఇది మాట్లాడుకుందామని చెప్పినందుకు సంఘటన జరిగిన న్యాయం కోసం గ్రామ పెద్దల కోసం వేచి చూచామని అయినప్పటికీ తమకు న్యాయం జరగని కారణంగా మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయబోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పత్రిక కార్యాలయాలకు వాళ్ళు వచ్చి ఫిర్యాదుపరుతులను మీడియాకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దౌర్జన్యంగా తమను బెదిరిస్తున్నారని తమ తాతల కాలం నాటి సమాధులను దోషం చేయడమే కాకుండా ఈత చెట్లు చెరువు తూము కాలువ చిద్రం చేసి తన పొలంలో కలుపుకున్నాడని వారు ఫిర్యాదు చేశారు. తమకు రక్షణ కల్పించాలని న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# బాలల హక్కులు పరిరక్షణ సమితి పోస్టర్ ఆవిష్కరణ




**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జూలై 23:** తెలంగాణ రాష్ట్రంలో స్వచ్ఛందంగా బాలల హక్కుల పరిరక్షణ కోసం విశేష కృషి చేస్తున్న "బాలల హక్కులు పరిరక్షణ సమితి(చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం, సీ.ఆర్.పీ.ఎఫ్.)" పోస్టర్ ను బుధవారం నెల్లికుదురు మండల కార్యాలయంలో తహశీల్దార్ సీహెచ్ నరేష్, ఎస్.హెచ్.ఓ. రమేష్ లు సంయుక్తంగా ఆవిష్కరించారు. తహశీల్దార్ నరేష్ మాట్లాడుతూ,బాలలు ఎదిగే వయసులో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు,తోటి మిత్రులు, సహచరులు, పరిసర సమాజ సభ్యులు, సంయమనంతో, క్రమశిక్షణతో, జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.పిల్లలు తమ చుట్టు ప్రక్కల నెలకొన్న వాతావరణాన్ని, పరిస్థితులను, సంఘటనలను, చర్యలను పరిశీలిస్తూ,అనుకరిస్తూ, అనుసరిస్తూ పెరుగుతారని, అలాంటి సమయాల్లో, దృఢమైన మనస్తత్వంతో ఉన్నతమైన ఆలోచనలతో, గొప్ప వ్యక్తిత్వంగల,బాధ్యతగల పౌరులుగా ఎదగడానికి అవకాశం ఉన్న నేపథ్యంలో సమాజం యొక్క పాత్ర క్రియాశీలకంగా వ్యవహరిస్తుందని అందుకు మనమందరం మన వంతుగా పూర్తి సహాయ, సహకారాలను చిత్తశుద్ధితో అందించాలని ఆయన కోరారు.ఎస్.హెచ్.ఓ. రమేష్ మాట్లాడుతూ, బాలల హక్కులు పరిరక్షణ కోసం కృషి చేస్తున్న ఫోరంకు స్టేషన్ పరిధిలో మా పోలీసు శాఖ తరఫున పూర్తి సహకారం ఉంటుందని, బాలబాలికలపై అక్రమంగా,అనైతికంగా ఎలాంటి దుర్చర్యలు,దుర్ఘటనలు,అకృత్యాలు జరిగినా అందుకు బాధ్యులైన వారు ఎంతటివారైనా కఠినంగా వ్యవహరించి, తగిన శిక్ష పడేటట్లు చూడాల్సివస్తుందని, కాబట్టి అలాంటి ఆలోచనలు చేసేవారు ఒళ్ళు దగ్గర పెట్టుకొని నడుచుకోవాలని హెచ్చరించారు.చట్ట ప్రకారం 18సం.ల లోపు పిల్లలందరూ బాలలేనని, పటిష్టమైన దేశ భవిష్యత్తు బాలబాలికలపైననే ఆధారపడి ఉన్నందున భారత రాజ్యాంగం ఆ బాలలకు కూడా ఎన్నో హక్కులను కల్పించిందని, వాటిని అతిక్రమించిన వారందరూ శిక్షార్హులేనని రమేష్ అన్నారు.14సం.ల లోపు పిల్లలందరూ వారికి అందుబాటులో ఉన్న ఏదో ఒక పాఠశాలలో చదువుకుంటూ ఉండాలని, అలా కాకుండా వేరే ఎక్కడో ఒకచోట ఏదో ఒక పని చేసుకుంటూ ఉండకూడదని ఆయన వివరించారు. అలాంటి పిల్లలను ఎవరైనా పనిలో పెట్టుకున్నా, పనిలో పెట్టుకున్న వారితో పాటుగా,పెట్టించిన వారు కూడా తగిన శిక్షను అనుభవించవలసి వస్తుందని ఎస్.హెచ్.ఓ. రమేష్ అన్నారు.ఫోరం స్టేట్ జనరల్ సెక్రటరీ దొనికెన కుమారస్వామి మాట్లాడుతూ,బడి ఈడు పిల్లలు ఎవరైనా, మీకెవరికైనాఎక్కడైనా బడికి పోకుండా, ఇతర పనులు చేస్తూ కనిపిస్తే వెంటనే మాకు తెలియజేస్తే, అలాంటి పిల్లలకు తగు విధమైన భద్రత, మనుగడ ఏర్పాట్లు చేయబడతాయని చెప్పారు. ఉచితమైన (టోల్ ఫ్రీ ఫోన్ నెంబర్ 10982) తెలియజేయాలి.ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ టి. తరంగిణి, సామాజిక కార్యకర్త రంజాన్, మండల కార్యాలయ సిబ్బంది, పోలీసు శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. దొనికెన కుమారస్వామి స్టేట్ జనరల్ సెక్రెటరీ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం తెలంగాణ.. ఫోన్ నెంబర్.9441634761...

# ఉమ్మడి జిల్లాలో అత్యధిక జిల్లా పరిషత్,మండల పరిషత్‌లను గెలుస్తాం

● మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్,ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ● పాలమూరులో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ● పాల్గొన్న ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ● స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతుంది ● ప్రతి గ్రామంలో కాంగ్రెస్ ఎన్నికల హామీలను ఎండగట్టండి





**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 23:** కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నేరవేర్చనందుకు వారు ఓట్లు అడగాలంటే బయపడ్తున్నారు రాబోయే స్థానిక ఎన్నికలలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నుండి అధిక ఎంపీటీసీలు జడ్పిటిసిలు గెలిచి జిల్లా పరిషత్ చైర్మన్ లను,ఎంపీపీలను అధిక సంఖ్యలో చేజిక్కించుకోవాలని స్థానిక నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కొరకు నాయకులతో కార్యకర్తలతో, విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యకర్తలను నాయకులను ఉద్దేశిస్తు పాలమూరు జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం రావాలంటే స్థానిక ఎన్నికల్లో నాయకులు సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి ఎంపిటిసిలుగా జడ్పీటీసీలుగా గెలచి జిల్లా పరిషత్ చైర్మనులుగా, ఎంపీపీలుగా అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు పదవులను అధిరోహించాలని విస్తృత స్థాయి సమావేశంలో నాయకులతో కార్యకర్తలతో మాట్లాడారు.అంతే కాకుండా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పూర్తిచేయడంలో పూర్తిగా విఫలమైందని గ్రామాలలో స్థానిక నాయకులు ఓట్లు అడగాలంటే భయపడుతున్నారని ఎలక్షన్ లో ఇచ్చిన హామీలలో తులం బంగారం, స్కూటీలు,కౌలు రైతులకు రైతుబరోస, మహిళలకు 2500, 4000 పింఛన్లు మొదలైన హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, గ్రామాలలో ప్రజలను ఏ రకంగా ఓట్లు అడగాలో తెలియని స్థితిలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారని వారి వైఫల్యాలను గ్రామాలలో ఎండగట్టాలని, కాంగ్రెస్ ప్రభుత్వము ఏర్పాటు అయి 18 నెలలు పూర్తయిన కూడా జిల్లాలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైనా పనులనే చేస్తున్నారు తప్పా ఇంకా కొత్త పనులు చేయడం లేదని వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలన్నీ 18 నెలలు పూర్తయిన కూడా అమలు చేయడం లేదని ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు స్థానిక ఎన్నికల్లో వివరించాలని కార్యకర్తలకు,నాయకులకు విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తో కలిసి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాలమూరు నియోజవర్గ మాజీ జడ్పిటిసిలు,ఎంపిపిలు మున్సిపల్ చైర్మన్లు, ఎంపిటిసిలు,సర్పంచులు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశాలను బేఖాతార్ చేస్తున్న రెవిన్యూ , ఫారెస్ట్ , మైనింగ్ జిల్లా అధికారులు

● తెలంగాణ మిడ్ వెస్ట్ క్వారీ పేరుతో ప్రభుత్వ, ఫారెస్ట్ భూములు, చుట్టూ ఉన్న గిరిజన ప్రజల రైతుల భూమి కబ్జా. ● క్వారీ ద్వారా చుట్టూ ఉండే ప్రజలకు ఎన్నో అనర్థాలు, వ్యవసాయానికి పనికిరాకుండా పోతున్న భూములు. ● తెలంగాణ మెడ్ వెస్ట్ క్వారీపై పూర్తిస్థాయిలో సమగ్ర సర్వే జరిపించాలని డిమాండ్..బోడ రమేష్ నాయక్.లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మహబూబాబాద్..





**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జూలై 23:** లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ మాట్లాడుతూ బుధవారం మహబూబాబాద్ జిల్లా, కేసముద్రం మండలం, అర్పణ పల్లి గ్రామ రెవిన్యూ పరిధిలో తెలంగాణ మెడ్ వెస్ట్ పేరుతో క్వారీను నడుపుతున్నారు.ప్రభుత్వ భూమిలతో పాటు ఇతరుల గిరిజనుల భూములు కబ్జాకు గురవుతున్నాయని జాతీయ ఎస్టి కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ నాయక్ దరఖాస్తు చేసుకోగా జాతీయ ఎస్సీ కమిషన్ న్యూఢిల్లీ నుండి తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి మైనింగ్ కమిషనర్, ఫారెస్ట్ డిపార్ట్మెంట్, రెవిన్యూ కమిషనర్లకు తెలంగాణ మిడ్ వెస్ట్ క్వారీపై పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ, జాయింట్ సర్వే జరిపించాలని నోటీస్ రూపంలో ఆదేశాలు జారీ చేయగా బుధవారం అర్పణ పల్లి రెవిన్యూ పరిధిలో ఉన్నటువంటి తెలంగాణ మెడ్ వెస్ట్ క్వారీలో రాగా పై మూడు డిపార్ట్మెంట్ వారు ఎటువంటి రికార్డ్స్ లేకుండా, రెవిన్యూ రికార్డ్స్ లేకుండా, మండల సర్వేయర్ లేకుండా వచ్చి క్వారీ యజమానులు చూపించిన కాళీ రాళ్లను చూయించడం జరిగింది. కానీ ఎటువంటి సర్వే జరగలేదు. క్వారీ యజమానులు చూపించిన రాళ్లకు ఇరువైపులా ఉన్నటువంటి భూములను కూడా క్వారీ కింద వాడుకుంటున్నారు. ఈ విషయంపై జిల్లా మైనింగ్ ఏజీ నిరంజన్, రెవిన్యూ గిర్ధవర్ సౌజన్య, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ఎఫ్ఆర్ఓ జోష్ణ వివరణ కోరగా సర్వే అయిందని చెప్తున్నారు. పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ సర్వే జరుపకుండానే తూతూ మంత్రంగా వ్యవహరించారని అన్నారు. అదేవిధంగా అక్కడ జరిగిన దృశ్యాలను వీడియో, ఫోటో తీసుకుంటుంటే వారి యొక్క ప్రైవేట్ సెక్యూరిటీలతో దౌర్జన్యానికి పాల్పడి, భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అని అన్నారు. జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశాలను కూడా బెకాతర్ చేస్తున్నారు. ఈ అక్రమ క్వారీల వలన బాంబు బ్లాస్టింగ్ లో వాడే రసాయనాల వలన వాటి శబ్దాల వలన చుట్టుపక్కల ఉన్నటువంటి వ్యవసాయ భూములు వ్యవసాయనికి పనికి రాకుండా పోతున్నాయి. అదే విధంగా నీటి కాలుష్యం, శబ్ద కాలుష్యం, గాలి కాలుష్యంతో చుట్టుపక్కల నివసించే ప్రజలకు అనేక రకాలువ హాని కలుగుతుందన్నారు. ఇకనైనా జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశాలను పకడ్బందీగా అమలు చేస్తూ తెలంగాణ మెడ్ వెస్ట్ వారిపై సమగ్ర సర్వే జరిపించి ఫారెస్ట్ భూములు, ఇతర ప్రజల భూములు అన్యాక్రాంతం కాకుండా చూసి చుట్టుపక్కల నివసించే ప్రజలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భూక్య రవీందర్ నాయక్, మైనింగ్ సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది, ఫారెస్టు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేగూరి రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

● బహుమానంగా చటాన్ పల్లి రామ్ నగర్ వార్డులు గెలిపించాలి... ఎమ్మెల్యే శంకర్

● అన్న జన్మదినం, తమ్ముళ్ల ఔదార్యం..

● రాజేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు





**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 23:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకుడు మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ చెగూరి రాజేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని బుచ్చిగూడ రోడ్డు లోని రెడ్డి భవన్లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ప్రభుత్వ హాస్పిటల్లో రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేశారు. హాస్పిటల్ ఆవరణలో రోగుల బంధువుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ మాట్లాడుతూ... రాజేందర్ రెడ్డి ఔదార్యం మంచితనం తనకు తెలుసునని, యువత మంచితనంలో, సేవాగుణంలో రాజేందర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని వెన్నంటే ఉండాలని సూచించారు. రాజేందర్ రెడ్డి రాజకీయంలో మరింత చురుకుగా ఉండి చటాన్ పల్లి, రాంనగర్ కాలనీలోని వార్డులలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక తానే నిర్ణయించుకొని, గెలుపు బాధ్యత తీసుకొని గెలిపించి బహుమానంగా ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు. కొంకళ్ల చెన్నయ్య,గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు కొప్పుల మదన్ మోహన్ రెడ్డి, చెంది తిరుపతి రెడ్డి,కొప్పునూరి ప్రవణ్,, రవికుమార్,గడ్డమీద రమేష్,అమ్మపల్లి శేఖర్ గౌడ్, ఖాలేద్ ఖాన్, చల్లా సందీప్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,వాసు, ఇంద్రసేనారెడ్డి విజయ్ రెడ్డి, నరసింహారెడ్డి, అమరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి , హనుమంతు, కుమార్, యాదగిరి గౌడ్, ఖాసీం ఖాన్ మరియు చటాన్ పల్లి రాంనగర్ కాలనీ యువత భారీగా పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్ నగర్ సేవా సంకల్ప్ ఆధ్వర్యంలో చేగురి రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

● జన్మదిన సందర్బంగా పలుసేవ కార్యక్రమాలు



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 23:** లయన్స్ క్లబ్ అఫ్ షాద్ నగర్ సేవా సంకల్ప్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ రవి కుమార్ ఆధ్వర్యంలో లయన్ మదన్ మోహన్ రెడ్డి సహకారం తో షాద్ నగర్ పట్టణం లోని స్థానిక పర్వాన్ కాలనీ యందు కాంగ్రెస్ నాయకుడు మాజీ కౌన్సిలర్ శ్రీ చేగురి రాజేందర్ రెడ్డి జన్మదిన సందర్బంగా షాద్ నగర్ శాసనసభ్యులు శ్రీ వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథి గా మెగా రక్త దాన శిబిరం ఏర్పాటు చేసి 34 మంది సభ్యులచే రక్త దానం చేయించారు, కంటి పరీక్ష శిబిరం ఏర్పాటు చేసి సుమారు 250 మందికి కంటి శుక్లాలలను పరీక్షించినారు, ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించి 300 మందికి పైగా ఆరోగ్య సమస్యలను గుర్తించి డాక్టర్ చే తగు ఆరోగ్య సూచనలు చేసినారు. అనంతరం కాలనీ యందు మొక్కలు నాటడం జరిగినది. తర్వాత అన్నధాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. అదేవిదంగా కిషన్ నగర్ శివారు నందు గల వేదపాఠశాల యందు కూడా అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమం లో లయన్ ప్రెసిడెంట్ రవికుమార్, గ్రంధాలయం చైర్మన్ లయన్స్ మదన్ మోహన్ రెడ్డి, జోన్ చైర్మన్ రాజు, క్లబ్ సభ్యులు లయన్ శివానాగయ్య గారు, లయన్ రామకృష్ణ రెడ్డి, లయన్ లక్ష్మిపతి రెడ్డి, లయన్ అశోక్, లయన్ నర్సింహా రెడ్డి, లయన్ వెంకట్ నాయక్, ఎర్ర శ్రీనివాస్, చందు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, యువజన సభ్యులు పాల్గొని వివిధ కార్యక్రమంలను విజయవంతం చేశారనీ లేని విజయేందర్ రెడ్డి తెలిపారు.



## ఎంపీకీ చామలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 23:** యాదాద్రి భువనగిరి జిల్లా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## వికలాంగ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు 50బస్తాల సిమెంట్

### - ప్రకటించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 23:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఇందిరమ్మ ఇళ్లు వచ్చిన వికలాంగ లబ్ధి దారులకు 50 బస్తాల సిమెంట్ ప్రకటించిన సందర్భంగా బుధవారం రోజు యాదగిరిగుట్టలో బీర్ల ఐలయ్య చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన ఇందిరమ్మ ఇళ్ల వికలాంగ లబ్ధిదారులు.

## మోటకొండూరు మండల ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రటరిగా సుదగాని నవీన్ గౌడ్



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 23:** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని ప్రెస్ క్లబ్ ఎన్నికలు ఇటీవల నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మండల ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రటరిగా మండలంలోని చందేపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్ట్ సుదగాని నవీన్ గౌడ్ ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ... తన మీద నమ్మకంతో ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రటరిగా ఎన్నుకున్నందుకు తోటి జర్నలిస్ట్ లకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ప్రజా సమస్యలు వెలికి తీసి అధికారుల ప్రజా ప్రతినిదుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

## జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడినీ పరామర్శించిన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 23:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో ఇటీవల అనారోగ్యనికి గురైన యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డిని వారి నివాసంలో కలిసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్న తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్.

## రెండు తలల గొర్రె పిల్ల జననం

**తొలి అక్షరం//వలిగొండ, జూలై 23:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం రెడ్ల రేపాక గ్రామానికి చెందిన నోముల మల్లేష్ యాదవ్ గొర్ల మందలో మంగళవారం రోజు రాత్రి రెండు తలల గొర్రె నాలుగు కాళ్లతో పుట్టిన గొర్రెను చూసి ఆ గ్రామ ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వైద్యాధికారులు పరిశీలించి జన్యులోపం కారణంగా జన్మించిందని వారు సూచించారు.



# రైల్వే ప్లాట్ ఫామ్ నిర్మించాలని సిపిఐ ధర్నా

**● జనరల్ భోగీల సంఖ్య పెంచాలి, ప్యాసింజర్ రైలు పునరుద్ధరించాలి, కొత్త రైళ్లు నిలపాలి ● సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్... బి అజయ్ సారథి రెడ్డి డిమాండ్**







**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జులై 23:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కొత్త బజార్ వైపు రైల్వే ప్లాట్ ఫామ్ తక్షణమే నిర్మించాలని కోరుతూ స్థానిక భగత్ సింగ్ విగ్రహం దగ్గర భారీ ధర్నా నిర్వహించడం జరిగింది. జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ కొత్త బజార్ ప్రాంత ప్రయాణికులకు ప్లాట్ ఫామ్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.మహిళలు, దివ్యాంగులు వృద్ధులు,ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్లాట్ ఫామ్ లేకపోవడంతో కొత్త బజార్ ప్రాంత ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే రైల్వే అధికారులు స్పందించి ముందుగా కొత్త బజార్ కు ప్లాట్ఫారం నిర్మించాలని డిమాండ్ చేశారు, జనరల్ బోగీల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు, కరోనాకాలంలో నిలిచిపోయిన ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. మహబూబాద్ జిల్లా కేంద్రం అయినందున కొత్త రైలు ఆపాలన్నారు. ఎక్స్ప్రెస్ లలో స్త్రీలకు వృద్ధులకు ప్రత్యేకమైన భోగిలను కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ దక్షిణ మధ్య రైల్వే జీఎం స్పందించి ప్లాట్ ఫామ్ ను నిర్మించి రైల్వే సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని లేకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన ఉదృతం చేస్తామని బి అజయ్ సారధి రెడ్డి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్,మేక వీరన్న, కేదాసు రమేష్, మాలోతు రవీందర్,ఆబోతు అశోక్, అజ్మీర వేణు, మంద శంకర్, ఆలేటి మహేష్,గాధం శ్యాంప్రసాద్, డి రమేష్, రవిచంద్రబోస్, బల్లెం శ్రీకాంత్, తోట రమేష్, కూరాకుల పాల్, తండా శ్రీనాథ్, రఫీ, మెతుకు కుమార్, విజయ్,విక్రమ్, మిరియాల మల్లికార్జున్, మేక వెంకటేష్, కోన సత్యం, రాగ మల్లయ్య, నటరాజ్ ,వంగూరి నాగేంద్రబాబు,నిర్మల, సోమ నరసమ్మ, యశోద, ఉప్పలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

**తొలి అక్షరం/కరీంనగర్ టౌన్ జులై 23:** భారీ వర్షాల నేపథ్యంలో కరీంనగర్ కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. బుధవారం కరీంనగర్ జిల్లాలో 49.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో సహాయం కొరకు 0878 2997247 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయాలని తెలిపారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లోనూ కంట్రోల్ రూమ్ ఏర్పాటయిందని, మున్సిపల్ కార్పొరేషన్ సహాయం కోసం 9849906694 కు ఫోన్ చేయాలని కోరారు. భారీ వర్షాలు కురుస్తున్నందున చిల్లర వ్యాపారులు , వినియోగదారుల కుటుంబం సురక్షితం మరియు భద్రంగా ఉండడని సూచించారు.




# ఆదివాసి ప్రజలపై అక్రమ కేసులు ఎత్తి వేయాలి




**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జులై 23:** ఆదివాసి పేదలపై అక్రమ కేసులు ఎత్తివేయాలని సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. 2018 లో మహబూబాబాద్ జిల్లా, గంగారం మండల కేంద్రంలో ఫారెస్ట్ అధికారులను అడ్డుకున్నారని తప్పుడు కేసు పెట్టారని ఆయన అన్నారు. 7సంవత్సరాలుగా ఆదివాసి ప్రజలు తమ పనులను కోల్పోతూ 2 సంవత్సరాలు నర్సంపేట కోర్టుకు, గత 5 సంవత్సరాల నుంచి మహబూబాబాద్ కోర్టుకు తిరుగుతున్నారని చంద్రన్న ఆవేదనతో అన్నారు. ఆదివాసి పేద ప్రజలు సదును చేసుకున్న భూముల్లో పంటలు వేసుకుంటుంటే అత్యుత్సాహంతో అప్పటి ఫారెస్ట్ అధికారులు తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపారని అన్నారు. 12 మంది వారం రోజులు జైలు లో నిర్బంధించారని అన్నారు. జైలుకు వెళ్లిన వారిలో గర్భిణీ మహిళల, చంటి పిల్ల తల్లిలు, వృద్ధులు కూడా ఉన్నారని చంద్రన్న గుర్తు చేశారు. ప్రజా పరిపాలన అంటున్నా రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసి, ఇతర పేద రైతులపై పెట్టిన అక్రమ కేసులు బేసరత్తుగా ఎత్తివేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకుఎదురవుతున్న అన్ని సమస్యలను పరిష్కరిస్తున్నానని చెబుతున్న రాష్ట్ర మంత్రి దానసరి సీతక్క, అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ లు జోక్యం చేసుకొని ఈ కేసు మరియు ఇలాంటి అనేక తప్పుడు కేసులను ఎత్తివేయటానికి జోక్యం చేసుకోవాలని చంద్రన్న కోరారు. సిపిఐ మాస్ లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఉమ్మగాని సత్యం, బూర్గుల మోష తదితరులు సంఘీభావం తెలిపారు. ముద్దాయిలుగా ములుకూరి జగ్గన్న, పూనం ప్రభాకర్, జజ్జన సతీష్, రవి, వీరస్వామి, కన్నయ్య, కాంతారావు, నరసయ్య, వెంకటమ్మ, సమ్మక్క మునీంద్ర సారక్కలు ఉన్నారు.

# భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి 50వ జన్మదినోత్సవం

**● పేద ప్రజలకు రోగులకు పండ్లు పంపిణీ చేసిన పోత్నక్ ప్రమోద్ కుమార్**




**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జులై 23:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పట్టణ సేవాదళ్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం రోజు భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి 50వ జన్మదినం సందర్భంగా సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజ్ హాస్పటల్లోని పేదలకు రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించగా ఇట్టి కార్యక్రమానికి జై బాబు జై భీమ్ జై సమ్మిదాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ పోత్నక్ ప్రమోద్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని రోగులకు పేదలకు పండ్లు బ్రెడ్లు పంపిణీ నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి యువజన కాంగ్రెస్లో చేరి అంచలంచలుగా ఎదుగుతూ గత పది సంవత్సరాలు కేసీఆర్ అరాచక పాలన ఎప్పటికప్పుడు ఎండగడుతూ ఎన్నో అక్రమ కేసులు మోపబడిన పోలీసులు లాటి చార్జి చేసి తీవ్రమైన గాయాలైనప్పటికి కూడా నమ్మిన సిద్ధాంతం కోసం కాంగ్రెస్ పార్టీ ఈ రాష్ట్రంలో అధికారంలోకి తేవడం కోసం కిరణ్ కుమార్ రెడ్డి ఎంతో కృషి చేశారని పార్లమెంటు సభ్యునిగా ఎన్నికైనప్పటినుండి చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పరిపాలనపై ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలపై అనేక రకమైన ఆరోపణలు చేస్తున్న చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎప్పటికప్పుడు టిఆర్ఎస్ నాయకులు టిఆర్ఎస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ దేశంలో నరేంద్ర మోడీ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరంతరం పోరాడుతూ ఉత్తమ పార్లమెంటరుగా నిలిచిన విషయం తెలిసిందే.పార్లమెంటు ఎన్ని రోజులు నడిస్తే అన్ని రోజులు పూర్తిస్థాయిలో హాజరై ఈ ప్రాంతంలో మరి ముఖ్యంగా భువనగిరి రాయిగిరి వరకు ఎంఎంటిఎస్ మూడో లైను కోసం పార్లమెంటులో అనేకమార్లు ప్రస్తావించడం జరిగింది.కేంద్ర ప్రభుత్వం 412 కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ మొదటి విడతగా 100 కోట్ల రూపాయలను విడుదల చేసి భువనగిరి మూడో మెట్రో రైల్వే ట్రాక్ పనులు ఈరోజు జరుగుతున్నయంటే చామల కిరణ్ కుమార్ రెడ్డి కృషి ఎంతో ఉందని అన్నారు. అలాగే బీబీనగర్ ఎయిమ్స్ హాస్పటల్లో ప్రజలకు అన్ని రకాల వైద్యం అందించేటట్లుగా పూర్తిస్థాయిలో ఎక్రిమెంట్లు ఏర్పాటు చేయడం అన్ని రకాల రోగులకు బీబీనగర్ ఎయిమ్స్ హాస్పటల్లోనే వైద్యం అందించేటట్లు కృషి చేస్తున్న చామల కిరణ్ కుమార్ రెడ్డిని అభినందిస్తూ రానున్న రోజుల్లో మరింత ఉన్నత స్థాయిలోకి ఎదగాలని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, కౌన్సిలర్ పడిగేల ప్రదీప్, కైరంకొండ వెంకటేష్ ,రాచమల్ల రమేష్, అతహార్, సామల రవీందర్, సేవాదళ్ పట్టణ అధ్యక్షులు డాకూరి ప్రకాష్ ,వెలిగే సురేందర్, నాగారం శంకర్ ,చిన్నగారి బలరాం, కవిత , శిరీష, సిరికొండ శివకుమార్, గుమ్మిడేల్లి రమేష్, దాసరి మధు, సాల్వేరు ఉపేందర్, ఉమేష్, తదితరులు పాల్గొనడం జరిగింది.

# పదేళ్లలో ఒక్క శిక్షణా తరగతి నిర్వహించలే.. ఇప్పుడు నిర్వహిస్తే అడ్డుకోవడమేమిటి..?

- ప్రెస్ అకాడమీ యూనియన్లకు కాదు.. జర్నలిస్టుల కోసం పనిచేస్తుంది
- ఏ యూనియన్ అయినా శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ముందుకు వస్తే తాము సిద్ధంగా ఉన్నాము
- పేర్లు నమోదు చేసుకోవాలని రెండు నెలల ముందే చెప్పాము
- వెనకబడుతున్న జర్నలిజం ను సోషల్ మీడియాతో పోటీపడే విధంగా చేయాలన్నదే లక్ష్యం
- యూనియన్లు నైతిక నియమావళిని పాటించాల్సిన అవసరం ఉంది
- తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 23:** పదేళ్ల కాలంలో పదవిలో ఉండి ఏనాడు కూడా జర్నలిస్టులకు శిక్షణా తరగతులు నిర్వహించలేదు.. కానీ నేడు పడిపోతున్న జర్నలిస్టుల విలువలను కాపాడాలని లక్ష్యంతో జిల్లాల వారీగా శిక్షణా తరగతులు నిర్వహిస్తుంటే అడ్డుకోవడం ఏమిటని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ మీడియా అకాడమీ యూనియన్లకు అతీతంగా పనిచేస్తుందని, జర్నలిస్టులకు ఏ సమస్యలు వచ్చిన ధైర్యంగా వచ్చి విన్నవించుకోవచ్చు కానీ సంఘాలను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తామంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లాలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని గత రెండు నెలల క్రితమే ప్రకటించడం జరిగిందని.. శిక్షణ తరగతులకు వచ్చే జర్నలిస్టులు తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని తెలిపామని కానీ వాటిని జర్నలిస్టులు పెడచెవిన పెట్టి ఈరోజు శిక్షణ తరగతులను అడ్డుకునేందుకు యత్నించడం సరికాదని సూచించారు. తెలంగాణ మీడియా అకాడమీ నుండే కాకుండా రంగారెడ్డి జిల్లా డిపిఆర్ఓ ద్వారా పదేపదే చెప్పించడం జరిగిందని తెలిపారు. తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో టీయూడబ్ల్యూజే సహకారంతో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామంటే ఎందుకు జీర్ణించుకోలేకపోతున్నారో వారు విజ్ఞతకే వదిలేస్తున్నామని తెలిపారు. పదేళ్లలో ఏనాడు కూడా శిక్షణ తరగతులు నిర్వహించాలని మరి ఎందుకు చెప్ప లేదు.. నేడు నిర్వహిస్తుంటే ఎందుకు అడ్డుపడుతున్నారో అర్థం కాని ప్రశ్నగానే మిగిలిపోతుంది. వెనుకబడుతున్న జర్నలిజం సోషల్ మీడియాతో పోటీపడే విధంగా చేయాలన్నదే మీడియా అకాడమీ లక్ష్యమని పేర్కొన్నారు. యూనియన్లు ఏవైనా ఉండొచ్చు కానీ నైతిక నియమావళిని పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రెస్ అకాడమీ యూనియన్ల కోసం కాదు జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తుందని పేర్కొన్నారు. శిక్షణ తరగతులు అంటే వాటికి కొన్ని నియమ నిబంధనలు ఉంటాయి.. ఒక తరగతి గదిలో నిర్ణీత విద్యార్థులు ఉంటే ఆ టీచర్ అంత ఉత్సాహంతో పాఠ్యాంశాలను బోధించేందుకు అవకాశం ఉంటుంది.. ఇక్కడ కూడా పరిమితి సంఖ్యకు అనుగుణంగానే జర్నలిస్టులను శిక్షణ తరగతులకు తీసుకోవడం జరిగింది కాబట్టే దాని ప్రకారం ప్రక్రియను కొనసాగించడం జరుగుతుంది. కానీ ఇది తెలియక కొంతమంది తమకేదో నష్టం జరిగిందని ఊహించుకొని ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే నష్టపోయేది వారే. ఏ యూనియన్ అయినా సరే తమకేమీ అభ్యంతరం లేదు.. ఎప్పుడు ఎక్కడ శిక్షణా తరగతులు నిర్వహించేందుకు తెలంగాణ మీడియా అకాడమీ సిద్ధంగా ఉంటుందని చైర్మన్ తెలిపారు. **శిక్షణ తరగతుల్లో మొదటిరోజు** జర్నలిజంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ భవనంలో రంగారెడ్డి జిల్లా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు నిర్వహిస్తున్న రెండు రోజులపాటు శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ వార్తల సేకరణలో సామాజిక ప్రభావం వంటి అంశాలు పూర్తిగా కొత్త రూపం దాల్చాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం డిజిటల్ మీడియా రంగం సాంకేతికతతో వేగంగా వార్తల సేకరణ సులభం అవుతుంది తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ సంపాదకులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్తు – మీడియా ధోరణులు, ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. సోషల్ మీడియా యూట్యూబ్ లో వస్తున్న వార్తలు క్షణాల్లో ప్రజల్లో వెళుతున్నాయని తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఫేక్ న్యూస్, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా, ఫ్యాక్ట్ చెక్, మొదలగునవి టెక్నికల్ గా ఏలా ఉపయోగించాలో జర్నలిస్టులకు సవివరంగా తెలియజేశారు. సీనియర్ జర్నలిస్ట్ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ, నేర వార్తల సేకరణ లో తీసుకోవలసిన జాగ్రత్తలు, చట్టాలపై అవగాహన ఉండాలని, వార్తలు సేకరించే ముందు నిజనిర్ధారణ చేసుకొని చేసుకుని వ్రాయాలని ఆయన సూచించారు, అలాగే నేర వార్తలు లలో చేయాల్సినవి చేయకూడనివి అంశాలపై క్లుప్తంగా వివరించారు. సీనియర్ జర్నలిస్ట్ దిలీప్ రెడ్డి మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం– 2005 గురించి సమగ్రంగా వివరించి జర్నలిస్టుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వర రావు, ఐజేయూ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి, టీయూడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు సలీమ్ పాషా,కార్యదర్శి మేకల సత్యనారాయణ, రంగారెడ్డి జిల్లా డిపిఆర్ఓ పి.సి. వెంకటేశం, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఎంపీ చామల జన్మదిన వేడుకలు

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జులై 23:** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిమ్మనగోటి జోజి పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా, మండల అధ్యక్షులు జోజి చెడే మహేందర్ మాట్లాడుతూ భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పేద ప్రజల కోసం ఆదరణగా నిలుస్తున్నారు. ప్రజల అవసరాలపై ఆయన శ్రద్ధ చూపుతూ, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడానికి సమర్ధంగా పోరాడుతున్నారు. ఆయన నాయకత్వంలో భువనగిరి పార్లమెంటు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్డగూడూర్ మండల పార్టీ అధ్యక్షులు నిమ్మలగోటి జోజి , వర్కింగ్ ప్రెసిడెంట్ రాచకొండ రమేష్, సీనియర్ నాయకులు వల్ల%శీ%భట్ల రవీందర్రావు, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు పూలపెల్లి సోమిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గూడెపు పాండు, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి రమేష్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు చెడే అంబేద్కర్, అడ్డగూడూర్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బైరెడ్డి సందీప్ రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షులు నాగులపల్లి రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలెంల విద్యసాగర్, మెడబోయిన శీను, సీనియర్ యూత్ కాంగ్రెస్ నాయకులు పూలపల్లి రాజశేఖర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాలెంల సురేష్, గడ్డం సోమన్న గౌడ్, సోమన్న, మందుల సోమన్న, యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా నాయకులు కన్నెబోయిన రాజశేఖర్ యాదవ్, పయ్యావుల సాయి, సూతరపు నరేష్, తదితరులు పాల్గొన్నారు.